epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 149 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 2 ఏప్రిల్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

# ఒరాకిల్ 'లేఆఫ్' బాంబు




- 30వేల మంది టెక్కీల తొలగింపు!
- అందులో 12 వేలమంది భారతీయులే..
- తెల్లవారుజామున 6 గంటలకే టర్మినేషన్ మెయిల్స్
- లాభాల్లో ఉన్నా ఖర్చుల కోత పేరిట వేటు
- ఐటీ లోకంలో తీవ్ర కలకలం

ప్రపంచ ప్రసిద్ధ సాఫ్ట్‌వేర్ దిగ్గజం 'ఒరాకిల్' ఐటీ రంగంలో పెను సంచలనం సృష్టించింది. సంస్థాగత పునర్వ్యవస్థీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన సిబ్బందిలో ఏకంగా 18 శాతం మందిని ఇంటికి పంపాలని నిర్ణయించింది. ఈ భారీ కోతలో భాగంగా దాదాపు 30,000 మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయారు. అత్యంత విచారకరమైన విషయం ఏంటంటే.. ఈ బాధితుల్లో సుమారు 12,000 మంది భారతీయులే ఉన్నట్లు సమాచారం.

4

# నాటో నుంచి తప్పుకుంటాం



- అది 'కాగితపు పులి' కూటమి..
- ఇరాన్ యుద్ధంలో మిత్రదేశాల సహకారం సున్నా.. అందుకే ఈ ఆలోచన
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలనం
- బ్రిటన్ నౌకాదళంపై ఎద్దేవా..
- ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన కీర్ స్టార్మర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ వేదికపై మరోసారి బాంబు పేల్చారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివం తమైన సైనిక కూటమిగా భావించే నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) నుంచి అమెరికా వైదొలిగే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.


4

# భూవివాదాలకు చెక్!



## నేటి నుంచి భూభారతి అమలు

ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా సేవలు ప్రారంభం
ప్రతి సర్వే నంబర్‌కు 'భూధార్' ■ అధికారులతో పొంగులేటి సమీక్ష



"రాష్ట్రంలో దశాబ్దాలుగా వేధిస్తున్న భూవివాదాలకు చరమగీతం పాడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'భూభారతి' పోర్టల్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఐదు ఎంపిక చేసిన మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. బుధవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పొంగులేటి వివరాలు వెల్లడించారు.

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** తెలంగాణలో భూవివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది. ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. మొదటి దశలో ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా

మిగతా 2 లో




# కొత్త పట్టాదారులకు 'రైతు భరోసా' ఊరట

■ ఏప్రిల్ 15 నుంచి నిధుల జమ! ■ 85వేల మంది కొత్త రైతులకు లబ్ధి..

- దరఖాస్తుల పరిశీలనలో వ్యవసాయ శాఖ
- యాసంగి రెండో విడతగా రూ. 9,000 కోట్ల పంపిణీ లక్ష్యం

2



# అడుగంటుతున్న జూరాల

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. దీంతో సాగునీటితో పాటు, తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోంది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

2

- పాలమూరు రైతాంగంలో సాగునీటి సెగ!
- డెడ్ స్టోరేజీకి చేరిన నీటిమట్టం..
- ఎండిపోతున్న కోయిల్ సాగర్ ఆయకట్టు
- కర్ణాటక సర్కారుతో మంత్రి ఉత్తమ్ సంప్రదింపులు..
- 5 టీఎంసీల కోసం విజ్ఞప్తి



# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద
- చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపీలు
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ
- వైకాపా సభ్యుల వాకౌట్

5



## దోచుకోవడానికే అమరావతి ప్లాన్

అబద్దాలు, అడ్డగోలు సంపాదన బాబు నైజం

మావిగన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్

.. వివరాలు 13లో



రాష్ట్రంలో జరుగుతున్న మైనింగ్ స్కామ్‌పై ప్రభుత్వం సీఐడీ విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని, దీనిపై తక్షణమే 'హౌస్ కమిటీ' వేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

3

# పొంగులేటి అక్రమాలపై 'హౌస్ కమిటీ' వేయాల్సిందే

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ ■ సీఐడీ విచారణతో న్యాయం జరగదు
■ కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలి
ప్రజల పక్షాన ప్రశ్నిస్తే కేసులతో గొంతు నొక్కుతారా? : బీఆర్ఎస్ నేతలు

# రేషన్ కార్డుల ఏరివేత దుర్మార్గం

5 లక్షల కార్డులు ఇచ్చి..
15 లక్షలు తొలగించే కుట్ర..



- ఐటీ రిటర్న్స్‌ను సాకుగా చూపడం అన్యాయం
- కొండగట్టు ఘటనపై విచారం..
- పనుల్లో నిర్లక్ష్యంపై విచారణకు డిమాండ్
- రాష్ట్ర ప్రభుత్వంపై కవిత ధ్వజం!

3

# జగన్‌లాంటి మనిషిని చూడలే నేను చూడలే

## మూడు రాజధానుల పేరుతో రాష్ట్రం విధ్వంసం

- అమరావతి ఇక ప్రజా రాజధాని.. ఇంచుకూడా కదలించలేరు
- వింజమూరు పర్యటనలో సీఎం చంద్రబాబు నాయుడు

**నెల్లూరు, ఏప్రిల్ 1:** నా జీవితంలో వైసీపీ లాంటి పా ర్టీని, జగన్ లాంటి వ్యక్తిని చూడలేదు' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి ఆనందించారని మండిపడ్డారు. అమరావతి తీర్మానం రోజున వైసీపీ సభ్యులు అసెంబ్లీకి రాలేదన్నారు. అమరావతి ఏకైక ప్రజా రాజధాని అని.. ఇక ఇంచు కూడా ఎవ్వరూ కదిలించలేరని స్పష్టంచేశారు. వింజమూరులో సీఎం పర్యటించారు. వింజమూరులో నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీపై తీవ్రస్థాయిలో

మిగతా 5 లో



# అడుగంటుతున్న జూరాల

**మహబూబ్‌నగర్, ఏప్రిల్1:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పడిపోవడంతో ఆయకట్టు రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో సాగునీటితో పాటు తాగునీటి ఎద్దడి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందకపోవడంతో చివరి ఆయకట్టు భూముల్లో పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం రంగంలోకి దిగింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి, తక్షణమే కనీసం 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూరుకు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక



ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. చేతికి వచ్చిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే రైతులు తల్లడిల్లిపోతున్నారు. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆల్మట్టి లేదా నారాయణపూర్ నుండి నీటిని విడుదల చేస్తేనే ఈ గండం నుంచి గట్టెక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలకొన్న సాగునీటి సంక్షోభంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపైనే రైతాంగం ఆశలు పెట్టుకుంది.



# నేటి నుంచి భూభారతి అమలు

మొదటి పేజీ తరువాయి

ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి సేవలు ప్రారంభం కానున్నాయి. ఇక్కడ వచ్చే ఫలితాలను విశ్లేషించి, అవసరమైన మార్పులు చేసిన తర్వాత రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. భూభారతి విధానంలో అత్యంత కీలకమైన అంశం 'భూధార్'. ఆధార్ కార్డు తరహాలోనే ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేకమైన భూధార్ నంబర్‌ను కేటాయించనున్నారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూధార్‌ను కేటాయించినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇకపై వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో తప్పనిసరిగా సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా ప్రభుత్వం అమలు చేస్తోంది. గతంలోని ధరణి పోర్టల్‌లో ఉన్న 36 రకాల మాడ్యూల్స్ వల్ల కలిగే గందరగోళాన్ని తొలగిస్తూ, భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు మంత్రి వివరించారు. రైతులు తమ ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి, ఒక్క క్లిక్‌తో తమ భూమికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందేలా పోర్టల్‌ను రూపొందించారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, దీని ద్వారా రైతులకు భూమిపై పూర్తి భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కొత్త పట్టాదారులకు 'రైతు భరోసా' ఊరట



- ఏప్రిల్ 15 నుంచి నిధుల జమ!
- 85 వేల మంది కొత్త రైతులకు లబ్ధి..
- దరఖాస్తుల పరిశీలనలో వ్యవసాయ శాఖ
- యాసంగి రెండో విడతగా రూ. 9,000 కోట్ల పంపిణీ లక్ష్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** తెలంగాణ రాష్ట్రంలోని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఇప్పటివరకు పాత లబ్ధిదారులకే పరిమితమైన 'రైతు భరోసా' పెట్టుబడి సాయాన్ని, ఇకపై కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన వారు సుమారు 85 వేల మంది ఉన్నారని అంచనా వేయగా, అందులో ఇప్పటికే 62 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

## ఏప్రిల్ 15 నుంచి ఖాతాల్లోకి నగదు:

ప్రస్తుతం ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. భూమి వివరాలు, పట్టాదారుల నిజానిజాలను నిర్ధారించిన తర్వాత వారం రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. అర్హులుగా తేలిన కొత్త రైతులకు ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీల మధ్య యాసంగి (రబీ) రెండో విడత నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో మొత్తం రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వానాకాలం సీజన్‌లో లబ్ధి పొందిన ప్రతి రైతుకు, ఈ యాసంగిలో కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి సాయం అందనుంది.

## రికార్డు స్థాయిలో నిధుల పంపిణీ:

2025-26 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 69.39 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ. 6,000 చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లను కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే పంపిణీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. తాజా గణాంకాల ప్రకారం రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్యలో నల్లగొండ జిల్లా 5.22 లక్షల మందితో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సంగారెడ్డి (3.53 లక్షలు), ఖమ్మం (3.35 లక్షలు), సిద్ధిపేట (3.18 లక్షలు) జిల్లాలు ఉన్నాయి. మార్చి 22న మొదటి విడత నిధులను విడుదల చేసిన ప్రభుత్వం, ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడత నిధులను కూడా విడుదల చేసేందుకు కసరత్తు చేస్తోంది.

# నిప్పుల కొలిమిలా

**రానున్న మూడు నెలలు మండుటెండలు ఖాయం!**

**ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు**

**పది రోజులకు పైగా వీయనున్న వడగాడ్పులు.. ఐఎండీ హెచ్చరిక**

**హైదరాబాద్, ఏప్రిల్1:** తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చేదు వార్త వినిపించింది. ఈ ఏడాది వేసవి సీజన్ మొత్తం ఎండలు మంట పుట్టించనున్నాయని, ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయని హెచ్చరించింది. రానున్న మూడు నెలల కాలానికి సంబంధించి ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై ఐఎండీ బుధవారం ప్రత్యేక బులెటిన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఈసారి భానుడు ప్రతాపం చూపనున్నాడు. ఏప్రిల్ నెలలో సగటున మూడు నుంచి నాలుగు రోజులు వడగాడ్పులు వీస్తుండగా, మే మరియు జూన్ నెలల్లో వీటి తీవ్రత మరింత పెరిగి పది రోజులకు పైగా కొనసాగే అవకాశం ఉంది. కేవలం పగటి పూట మాత్రమే కాకుండా, రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండి ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేయనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం:

ఏప్రిల్ నెలలో ఉభయ గోదావరి జిల్లాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. అయితే, ఈశాన్య రాష్ట్రాలు మినహా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏప్రిల్‌లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. మార్చి నెలలో కూడా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో 'లానినా' ప్రభావం చివరి దశకు చేరుకుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు వాతావరణం తటస్థంగా ఉండి, నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యే జూన్ మాసం నుంచి 'ఎల్‌నినో' పరిస్థితులు మొదలవుతాయని ఐఎండీ వెల్లడించింది. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వడగాడ్పుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

- ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం
- వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశం




**హైదరాబాద్, ఏప్రిల్ 1:** తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టార్గెట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.



# రెండు జీపీలకు వికాస్ పురస్కారాలు

**మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామాలకు అరుదైన గౌరవం!**

**'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్' అవార్డుల ప్రకటన**

**మంత్రి సీతక్క హర్షం వ్యక్తం.. పారదర్శక పాలనకు నిదర్శనమని వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్1:** గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకమైన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల'ను ప్రకటించగా, రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలు ఈ గౌరవాన్ని దక్కించుకున్నాయి. వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన పంచాయతీలు వివిధ విభాగాల్లో జాతీయ స్థాయి అవార్డులను కైవసం చేసుకున్నాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' (ఉత్తమ పాలన) విభాగంలో జాతీయ పురస్కారాన్ని సాధించింది. అలాగే, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' (మహిళా అనుకూల పంచాయతీ) విభాగంలో అత్యుత్తమ గుర్తింపు పొందింది. గ్రామ స్థాయిలో పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం, మహిళా సాధికారత మరియు భద్రతలో చూపిన అసాధారణ కృషికి గాను ఈ అవార్డులు లభించాయి.

## మంత్రి సీతక్క అభినందనలు

జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. పారదర్శక పాలన, మహిళా సంక్షేమం దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్ట చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ విజయం సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు జాతీయ స్థాయిలో రాష్ట్ర కీర్తిని చాటాలని ఆమె ఆకాంక్షించారు.

# జీఎస్టీ వసూళ్లలో 8.3శాతం వృద్ధి

**మార్చిలో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు**

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** దేశంలో జీఎస్టీ వసూళ్లు నెలనెలా భారీగా వసూలు అవుతున్నాయి. దీంతో కేంద్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ.22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

# దూసుకొచ్చిన కారు

**నేడు వివాహ నిశ్చితార్థం...అంతలోనే రోడ్డు ప్రమాదం**

**ఖమ్మం, ఏప్రిల్ 1:** జిల్లాలో విషాదం నెలకొంది. ఎంగేజ్‌మెంట్ చేసుకోవాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణషాపుకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గొడ్డుగొర్ల ప్రసాద్(28) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతనికి వివాహం కూడా నిశ్చయమైంది. గురువారం నాడు నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణ షాపునకు ప్రసాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేప్పుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ప్రసాద్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, రేపు నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు.. ఇలా పాడే ఎక్కడంతో మద్దులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కొండగట్టు ఆలయంలో అపశృతి

**చలువ పందిళ్లు కూలి 15మందికి గాయాలు**



**జగిత్యాల, ఏప్రిల్ 1:** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.



# రేషన్ కార్డుల ఏరివేత దుర్మార్గం

**5 లక్షల కార్డులు ఇచ్చి.. 15 లక్షలు తొలగించే కుట్ర..**

**ఐటీ రిటర్న్స్‌ను సాకుగా చూపడం అన్యాయం**

**ప్రభుత్వంపై కల్వకుంట్ల కవిత ధ్వజం!**

**హైదరాబాద్, ఏప్రిల్1:** తెలంగాణ రాష్ట్రంలో పేదలకు అందాల్సిన రేషన్ కార్డుల విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ అనుసరిస్తున్న తీరుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రేషన్ కార్డుల ఏరివేత పేరిట ప్రభుత్వం చేపట్టిన చర్యలు దుర్మార్గమని, వీటిని తక్షణమే నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను వేధిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. కొత్తగా 5 లక్షల కార్డులు ఇచ్చామని ప్రచారం చేసుకుంటూనే, మరోవైపు రకరకాల సాకులతో 15 లక్షల కార్డులను తొలగించేందుకు కుట్ర పన్నుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలను చూపి పేదల నోటి కాడ కూడు తీసేయడం అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన దిశగా అడుగులు వేయాల్సిన ప్రభుత్వం, ఇలాంటి చర్యలతో వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని హితవు పలికారు. జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయంలో జరిగిన చలువ పందిళ్ల ప్రమాదంపై కూడా కవిత స్పందించారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడం వల్లే అవి కూలి 15 మంది భక్తులు గాయపడ్డారని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. పనుల్లో తీవ్రమైన నాణ్యతా లోపం కనిపిస్తోందని, ఉత్సవాల సమయంలో ఇలాంటి ప్రమాదాలు జరగడం భక్తుల భద్రతపై ఆందోళన కలిగిస్తోందని అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గ్యారెంటీలపై నిలదీయండి: రామ్

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో 6 గ్యారంటీల అమలులో అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై నిరసన తెలుపుతూ నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముందుగా 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లయినా ఇంతవరకు అమలు చేయకుండా మోసం చేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో బూత్ స్థాయి కార్యకర్తలు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి బోగస్ ఓటర్లను ఏరి వేయడంలో సహకరించాలన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు రాబోయే రోజుల్లో ఎప్పుడైనా వచ్చే అవకాశమున్నందున పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం

**తెలంగాణ హామీలు అమలు చేయాలని డిమాండ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా ఎపి పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.

## మార్కాపురం బస్సు ప్రమాద డ్రైవర్, యజమాని అరెస్ట్

**మార్కాపురం,ఏప్రిల్1 :** మార్కాపురం బస్సు ప్రమాదం కేసులో డ్రైవర్ యువరాజు, బస్సు యజమాని హరికృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘోర ప్రమాదంలో 14 మంది ప్రయాణికులు సజీవ దహనమవగా.. మరో 28 మంది గాయపడ్డారు. మార్చి 26న తెల్లవారుజామున మార్కాపురం మండలం రాయవరం సమీపంలో హరికృష్ణ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. హైదరాబాద్‌లో శ్రావణి ట్రావెల్స్ నడుపుతున్న యార్లగడ్డ కోటేశ్వరరావు వద్ద బస్సును సెకండ్ హ్యాండ్‌గా కొనుగోలు చేసి హరికృష్ణారెడ్డి నడుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం సమయంలో బస్సులో సుమారు 35 నుంచి 41 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం, బస్సు యాంత్రిక లోపాలు కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ యువరాజు, యజమాని హరికృష్ణారెడ్డి పరారీలో ఉండగా.. పోలీసులు వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 28 మంది ప్రయాణికులు మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# పొంగులేటి అక్రమాలపై ‘హౌస్ కమిటీ’ వేయాల్సిందే

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్
- సీఐడీ విచారణతో న్యాయం జరగదు..
- కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలి
- ప్రశ్నిస్తే కేసులతో గొంతు నొక్కుతారా?
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతల ధ్వజం



**హైదరాబాద్, ఏప్రిల్1:** రాష్ట్రంలో జరుగుతున్న మైనింగ్ స్కామ్‌పై ప్రభుత్వం సీఐడీ విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని, దీనిపై తక్షణమే ‘హౌస్ కమిటీ’ వేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు మైనింగ్ అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై సీఐడీ విచారణ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని కౌశిక్ రెడ్డి నిలదీశారు. “మంత్రి పదవిలో ఉన్న వ్యక్తిని సీఐడీ అధికారులు ప్రశ్నించగలరా? అందుకే ఆయన రాజీనామా చేయాలని మేం కోరుతున్నాం. నిజాలు తేలాలంటే సభా సంఘం వేయాల్సిందే” అని స్పష్టం చేశారు. అసెంబ్లీలో తాము నిరుద్యోగులు, పెన్షన్ల పక్షాన ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతలు వాడిన బూతులు వినిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి ప్రస్తుతం ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నారో స్పష్టం చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. “అన్నం పెట్టిన కేసీఆర్‌ను విమర్శించడం కడియంకు తగదు. ఆయన బిఆర్ఎస్ సభ్యుడైతే మా వెనుకే కూర్చోవాలి కదా.. కాంగ్రెస్ వాళ్ల మధ్య ఎందుకు కూర్చున్నారు?” అని ప్రశ్నించారు. పార్టీ మారిన వ్యక్తిని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భుజాన ఎత్తుకోవడం సిగ్గుచేటన్నారు.

**అసెంబ్లీలో చర్చా స్థాయి దిగజారింది : ఎమ్మెల్యే సంజయ్**

కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్ మాట్లాడుతూ, అసెంబ్లీలో మంత్రులు సబ్జెక్ట్ వదిలేసి తోటి సభ్యులను తిట్టడానికే సమయం కేటాయిస్తున్నారని విమర్శించారు. స్వర్ణకారుల కష్టాలు, ప్రజా సమస్యల గురించి చర్చించకుండా కేవలం అవినీతి ఆరోపణలు ఉన్న మంత్రులను వెనకేసుకొస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ చర్చలు చూసి పిల్లలు నవ్వుకుంటున్నారని, ఇప్పటికైనా పాలసీల గురించి, రాజ్యాంగ విలువల గురించి చర్చించాలని సూచించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, కేసులు వేసినా ప్రజల పక్షాన పోరాటం ఆపేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

# అమరావతిపై చర్చలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు

**నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎంపీలు**

**తెలంగాణ విభజన హామీలు నెరవేర్చాలన్న ఎంపి వంశీ**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఏపీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సందర్భంగా లోక్ సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను కాంగ్రెస్ కాల్చిచంపిందని వ్యాఖ్యానించారు. చివరి దశ ఉద్యమంలో కూడా 1200 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకున్నారన్న కిషన్ రెడ్డి.. సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. అయితే గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని ఆరోపించారు. ఏపీలో ఏడు ఎయిర్ పోర్టులు ఉంటే.. తెలంగాణలో ఒక్కటే ఎయిర్ పోర్టు ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహార శైలితోనే తెలంగాణకు ఎయిర్ పోర్టులు రాలేదన్నారు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు కలిసి అభివృద్ధిలో ముందుకెళ్లాలని సూచించారు. అన్నదమ్ముల్లాగా అభివృద్ధిలో ముందుకు సాగాలన్నారు. మోడీ అందిస్తున్న చేయత వల్ల తెలంగాణలో రైలు, రోడ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని అన్నారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతర తెలిపారు. కిషన్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలన్నారు. బీజేపీ ఇచ్చిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు మాట్లాడిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ తెలంగాణకు కేంద్రం బకాయిలు చెల్లించాలనన్నారు. ఏపీ చేపట్టిన బనకచర్లతో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణకు రావాల్సిన 200 టీఎంసీల నీళ్లు ఏపీ డైవర్ట్ చేస్తుందని ఆరోపించారు. బనకచర్లతో వందలాది ఎకరాలు నీట మునుగుతదన్నారు. తెలంగాణ కష్టాల మీద ప్రధాని మోదీ దృష్టిపెట్టాలన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు కోసం రిక్వెస్ట్ చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అంతర్గాం మండల కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 591 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణం సాధ్యమవుతుందా అనే విషయమై ప్రీ ఫిజిబులిటీ స్టడీ చేసేందుకు రూ.40.53 లక్షల ఫీజును ఎయిర్? పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్? సెక్రటరీ వికాస్? రాజ్ గతేడాదిలో ఉత్తర్వులు జారీ చేశారు.

# మంగళ్‌హాట్ గోదాముపై దాడి

**హోటళ్లకు చచ్చిన మేకల మాంసం**

**కుళ్లిన పది టన్నుల మాంసం స్వాధీనం**



**హైదరాబాద్, ఏప్రిల్ 1:** హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్–ఫాస్ట్, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

**3వేల మందితో పోలీస్ బందోబస్తు**

**హైదరాబాద్, ఏప్రిల్ 1:** నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.





సంపాదకీయం


# ట్రంప్ చితిమంటల్లో ప్రపంచం విలవిల!

పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుచిక్కడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నా అగ్రరాజ్యం అమెరికా పట్టించుకోవడం లేదు. అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పడంతో ఎటు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు ఖర్చు అవుతున్నాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం ప్రదర్శనలు చేశారు. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారనే అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రపంచ దేశాలకు గుదిబండగా మారాయి. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ కూడా రెచ్చిపోవడం దారుణం. ఇదే క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ లక్ష్యానికి గండిపడినట్లే. ఎందుకంటే మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రపంచ దేశాల మీద ఆధారపడి నడుస్తోంది. దీనికితోడు చమరు దిగుమతులపై ప్రభావం కారణంగా దేశంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేనాటికి 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియా లోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి.సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదనగా ఉంది. స్టాక్ మార్కెట్‌కు ఈ యేడాది 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా- ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది.ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికగా చూడాలి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ విద్యావం తులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగు తుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్థి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండడు.



# ఒరాకిల్ 'లేఆఫ్' బాంబు

- 30వేల మంది టెక్కీల తొలగింపు!
- అందులో 12 వేలమంది భారతీయులే..
- తెల్లవారుజామున 6 గంటలకే టర్మినేషన్ మెయిల్స్
- లాభాల్లో ఉన్నా ఖర్చుల కోత పేరిట వేటు
- ఐటీ లోకంలో తీవ్ర కలకలం




**న్యూయార్క్, ఏప్రిల్ 1 :** ప్రపంచ ప్రసిద్ధ సాఫ్ట్‌వేర్ దిగ్గజం 'ఒరాకిల్' ఐటీ రంగంలో పెను సంచలనం సృష్టించింది. సంస్థాగత పునర్వ్యవస్థీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన సిబ్బందిలో ఏకంగా 18 శాతం మందిని ఇంటికి పంపాలని నిర్ణయించింది. ఈ భారీ కోతలో భాగంగా దాదాపు 30,000 మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయారు. అత్యంత విచారకరమైన విషయం ఏంటంటే.. ఈ బాధితుల్లో సుమారు 12,000 మంది భారతీయులే ఉన్నట్లు సమాచారం.

### తెల్లవారకముందే చేదు వార్త..

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 6 గంటలకే వేలాది మంది ఉద్యోగుల ఇన్-బాక్స్‌ల్లో 'టర్మినేషన్' మెయిల్స్ ప్రత్యక్షమయ్యాయి. ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా, కనీసం మేనేజర్లు లేదా హెచ్‌ఆర్ విభాగం నుండి సమాచారం లేకుండానే ఈ మెయిల్స్ పంపడంపై ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. "మీ పాత్రతో ఇక కంపెనీకి అవసరం లేదు" అంటూ వచ్చిన ఒక్క మెయిల్‌తో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారి కెరీర్ ముగిసిపోయింది. మెయిల్ వచ్చిన వెంటనే కంపెనీ ల్యాప్‌టాప్‌లు, అంతర్గత వ్యవస్థల యాక్సెస్‌ను నిలిపివేయడం ఉద్యోగులను మరింత షాక్‌కు గురిచేసింది.

### లాభాల్లో ఉన్నా ఎందుకీ కోత?

ఒరాకిల్ ప్రస్తుతం ఆర్థికంగా పటిష్టంగానే ఉంది. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో సంస్థ లాభాలు 95 శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ డేటా సెంటర్ల రంగంలో 156 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ ప్రాజెక్టుల కోసం ఇప్పటికే 50 బిలియన్ డాలర్ల అప్పు తీసుకున్న ఒరాకిల్, నిర్వహణ ఖర్చులను తగ్గించుకునే క్రమంలోనే ఈ ఉద్యోగాల కోతకు పాల్పడినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా ఏడాదికి 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా చేయవచ్చని సంస్థ అంచనా.

### భారత్‌పై తీవ్ర ప్రభావం

ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది పని చేస్తుండగా, అందులో దాదాపు 40 శాతం మంది ఈ లేఆఫ్స్ బారిన పడ్డారు. ముఖ్యంగా అమెరికా, కెనడా వంటి దేశాల్లో కఠినమైన కార్మిక చట్టాల దృష్ట్యా, ఖర్చు తక్కువగా ఉండే భారతీయ విభాగాలపైనే మేనేజ్‌మెంట్ ఎక్కువ వేటు వేసినట్లు తెలుస్తోంది. మేనేజీరియల్ స్థాయి నుంచి ఇంజనీర్ల వరకు ఈ జాబితాలో ఉన్నారు.

### పరిహారం షరతులతోనే..

తొలగించిన ఉద్యోగులకు మూడు నెలల అదనపు జీతం, సర్వీసులో ఉన్న ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం వంటి ప్రయోజనాలను కంపెనీ ప్రకటించింది. అయితే, ఈ ప్యాకేజీ అందరికీ వర్తించదు. కంపెనీ నిర్ణయించిన గడువులోగా 'సామరస్యపూర్వకంగా' రాజీనామా చేసిన వారికి మాత్రమే ఈ ప్రయోజనాలు అందుతాయని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ భారీ లేఆఫ్స్ కేవలం మొదటి విడత మాత్రమేనని, రానున్న నెల రోజుల్లో మరిన్ని కోతలు ఉండవచ్చనే వార్తలు ఇప్పుడు ఐటీ వర్గాల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

# ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

- 16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు
- వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.

# యుద్ధం ముగింపునకు సిద్ధమే

### షరతులు వర్తిస్తాయన్న ఇరాన్

**టెహ్రాన్, ఏప్రిల్ 1:** అమెరికా- ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.



# నాటో నుంచి తప్పుకుంటాం

- అది 'కాగితపు పులి' కూటమి..
- ఇరాన్ యుద్ధంలో మిత్రదేశాల సహకారం సున్నా.. అందుకే ఈ ఆలోచన
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలనం
- బ్రిటన్ నౌకాదళంపై ఎద్దేవా..
- ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన కీర్ స్టార్మర్



**వాషింగ్టన్/లండన్, ఏప్రిల్ 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ వేదికపై మరోసారి బాంబు పేల్చారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైనిక కూటమిగా భావించే నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) నుంచి అమెరికా వైదొలిగే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నాటో కూటమిని ఒక 'కాగితపు పులి'గా అభివర్ణించిన ట్రంప్, దాని విశ్వసనీయతపై తనకు ఎప్పటి నుంచో అనుమానాలు ఉన్నాయని స్పష్టం చేశారు. బ్రిటన్‌కు చెందిన ఒక ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ తన అసహనాన్ని వెళ్లగక్కారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ జరిపే సైనిక చర్యల్లో నాటో దేశాలు తమకు అండగా నిలవడంలో విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. "కష్టకాలంలో సహకరించని మిత్రదేశాల కూటమిలో కొనసాగడం వల్ల ప్రయోజనం లేదు. ఇరాన్ విషయంలో వాళ్లు మాకు మద్దతు ఇవ్వడం లేదు, అందుకే నాటో నుంచి వైదొలిగే ఆలోచన చేస్తున్నాం" అని ట్రంప్ కుండబద్దలు కొట్టారు.

### బ్రిటన్ నేవీపై విమర్శలు..

ఇదే క్రమంలో బ్రిటన్ యుద్ధ నౌకల దుస్థితిని ట్రంప్ నేరుగా ఎద్దేవా చేశారు. "మీకు అసలు నావికాదళమే లేదు. ఉన్నవన్నీ చాలా పాతబడిపోయాయి. మీ వద్ద ఉన్న విమాన వాహక నౌకలు కూడా పనిచేయని స్థితిలో ఉన్నాయి" అంటూ విమర్శలు గుప్పించారు. రక్షణ వ్యయంపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌కు ఏమైనా సలహా ఇస్తారా అని ప్రశ్నించగా.. "నేను ఎవరికీ సలహాలు ఇవ్వను, ఆయనకు నచ్చింది ఆయన చేసుకోవచ్చు" అని పొడిగా సమాధానమిచ్చారు.

### స్టార్మర్ దీటైన జవాబు..

ట్రంప్ వ్యాఖ్యలపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ వెంటనే స్పందించారు. నాటో అనేది ప్రపంచం చూసిన అత్యంత సమర్థవంతమైన సైనిక కూటమి అని, దానికి బ్రిటన్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. "నాపై, ఇతర దేశాలపై ఒత్తిడి ఉన్న మాట వాస్తవమే, కానీ నేను తీసుకునే ఏ నిర్ణయమైనా బ్రిటన్ జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ఉంటుంది" అని స్టార్మర్ స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో పెను కలకలం రేపుతున్నాయి. ఒకవేళ అమెరికా నిజంగానే నాటో నుంచి తప్పుకుంటే, ప్రపంచ భద్రతా ముఖచిత్రం పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.




## జగన్ లాంటి మనిషిని నేను చూడలే

మొదటి పేజీ తరువాయి

విరుచుకుపడ్డారు. 'అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై లోక్‌సభలో చర్చ జరుగుతోందని.. ఆమోదం పొంది గురువారం రాజ్యసభకు వెళుతుందని సీఎం తెలిపారు. ఒకటో తేదీ వస్తే పేదలే గుర్తొస్తారని.. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఫించన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. 63 లక్షల మందికి ఫించన్లు ఇస్తున్నామన్నారు. ఫించన్లను మొక్కుబడిగా ఇవ్వడం లేదని... గౌరవంగా ఇంటి వద్దే ఇచ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫించన్లు, తల్లికి వందనం ఇచ్చామని తెలిపారు. స్త్రీశక్తి సూపర్ సక్సెస్ అయిందని.. ఆడబిడ్డలు దర్జాగా ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి వెళుతున్నారని తెలిపారు. 'మా ఆడబిడ్డల కోసం దీపం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. ఇప్పుడు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. పీఎంజీ కనెక్షన్ తీసుకున్నా.. ఏడాదికి రూ.2,465లు సబ్సిడీ ఇస్తాం' అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉదయగిరికి కూడా నీరిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'నాపై కోపంతో పోలవరం ప్రాజెక్ట్‌ను గోదావరిలో కలిపేశారు. గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తాం. శ్రీశైలం, పోలవరంతో ఉదయగిరి ప్రాంతానికి నీటి కొరత ఉండదు' అని అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెరగడం లేదని.. అందుకే ఖ4 ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

**బిల్లు తీసుకురాబోతున్న కేంద్ర ప్రభుత్వం**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. ఏమైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

# చంద్రబాబు కృషి వల్లనే అమరావతి సాకారం


- రైతుల పక్షాన చంద్రబాబుకు మంత్రి నారాయణ కృతజ్ఞతలు
- జగన్‌ను కుతంత్రాలు ఇక సాగవన్న మంత్రులు



**అమరావతి, ఏప్రిల్ 1 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి కృషి వల్లే రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభలో ఆమోదం పొందిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. అమరావతి రైతుల తరపున సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందినందుకు ప్రధాని మోదీకి సైతం ధన్యవాదాలు తెలియజేశారు. బుధవారం రాజధాని బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ నేపథ్యంతో అమరావతిలో మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు తెలిపారు. అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా పేరు పేరునా మంత్రి నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి అజేయం.. ఇకపై ఎవ్వరూ ఒక్క ఇంచు కూడా అమరావతిని కదల్చలేరని ధీమా వ్యక్తం చేశారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి నారాయణ స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా ఐదేళ్లపాటు మూడు ముక్కలాట ఆడిందంటూ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని రాష్ట్ర రాజధానిగా శాసనసభలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక ఉద్యోగం కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 14 వేల ఉద్యోగాలు ఇచ్చిందని మంత్రి ఆనం వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో కొలువుదీరిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీన క్రమం తప్పకుండా పెన్షన్ పంపిణీ చేస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్ లబ్దిదారులకు నెలకు రూ.4 వేల చొప్పున నగదు అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ దొంగ నాటకాలను గుర్తించి.. తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. లోక్‌సభలో రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో బుధవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ఏపీ రాజధానిగా అమరావతిని రాష్ట్ర ప్రజలంతా ఆమోదించారన్నారు. 33 వేల ఎకరాల భూములను రైతులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా ఇచ్చారని తెలిపారు. ఆనాడు జగన్ అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మేము అనుకూలమని ప్రకటించారని గుర్తు చేశారు. ప్రధాని మోదీ అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని కొల్లు రవీంద్ర తెలిపారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ చాలా ఘోరాలు, పాపాలు చేశారని వివరించారు. భూములు ఇచ్చిన రైతులు, మహిళలపై లాఠీఛార్జి చేయించారన్నారు. వారిపై అక్రమంగా కేసులు సైతం పెట్టించి జైలుకు పంపించారని చెప్పారు. చివరకు ఆ ప్రాంతంలో పరదాలు కట్టుకుని జగన్ వెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. న్యాయస్థానం టూ దేవస్థానం అని మహిళలు చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని గుర్తు చేశారు. ఐదేళ్లలో అదుగు పని కూడా చేయకుండా జగన్.. అమరావతిని చంపేందుకు ఎన్నో కుట్రలు చేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అద్భుతమైన అమరావతి ఆవిష్కృతమవుతుందని మంత్రి కొల్లు రవీంద్ర విశ్వాసం వ్యక్తం చేశారు. ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉండేలా కట్టుదిట్టమైన చట్టం అవుతుందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి ఇప్పుడు పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని చెప్పారు. వైసీపీ నేతలు చేస్తున్న కుట్రలు, వారు చేసే వ్యాఖ్యలు దుర్మార్గంగా ఉన్నాయని మంత్రి రవీంద్ర తెలిపారు. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొని అభ్యంతరాలు ఎందుకు చెప్పలేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను మంత్రి కొల్లు రవీంద్ర సూటిగా ప్రశ్నించారు. మళ్లీ నేడు అమరావతిపై విషం చిమ్మేందుకు వైఎస్ జగన్ యత్నించారని విమర్శించారు. ఐదేళ్ల పాటు గడ్డి పీకారా?.. ఇప్పుడు ఎలా ప్రశ్నిస్తారంటూ వైఎస్ జగన్‌పై ఆయన నిప్పులు చెరిగారు. కేంద్రం అందిస్తున్న సహకారంతో సీఎం చంద్రబాబు అమరావతిలో అభివృద్ధి పనులు చేస్తున్నారని వివరించారు. కేసుల భయంతో గత ఐదేళ్లుగా కేంద్రాన్ని నిధులు కూడా అడగలేక పోయారని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు.

# అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక

- రాజధానిపై ఉన్న సందిగ్ధతకు ఇక తెరపడినట్లే
- ఎక్స్ వేదికగా చంద్రబాబు హర్షం



**అమరావతి, ఏప్రిల్ 1:** లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు తెరపడిందన్నారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయని సోషల్ మీడియా ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం అన్నారు. ఈరోజు లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని సీఎం పేర్కొన్నారు. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇదన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయన్నారు. అమరావతి ఇక అజేయం.. అజరామరం అని అన్నారు సీఎం. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతామని స్పష్టం చేశారు. సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# ఏపీ పర్యాటకానికి 'ఢిల్లీ' దన్ను

**కేంద్ర మంత్రి షెకావత్‌తో నేడు కందుల దుర్గేష్ భేటీ!**

**రూ. 915 కోట్ల విలువైన 9 కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలు సిద్ధం**

**రాజమండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, విశాఖలో లలిత కళా అకాడమీకి విజ్ఞప్తి**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌సూచనతో 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' పునర్ముద్రణపై చర్చ**



అమరావతి, ఏప్రిల్1(మనసులో మాట): కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం వేళ ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం హస్తిన పర్యటనకు బయలుదేరి వెళ్లారు. గురువారం ఉదయం 9 గంటలకు ఆయన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ కానున్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులతో పాటు, సుమారు రూ. 915 కోట్ల విలువైన 9 నూతన ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని ఆయన కేంద్రాన్ని కోరనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో ఏపీని పర్యాటక హబ్‌గా మార్చేందుకు మంత్రి దుర్గేష్ కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా మచిలీపట్నం బీచ్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ (రూ. 120 కోట్లు), మంగళగిరి పానకాల స్వామి ఆలయం (రూ. 95 కోట్లు), అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం (రూ. 213 కోట్లు) వంటి పుణ్యక్షేత్రాల అభివృద్ధికి నిధులు కోరనున్నారు. అలాగే లంబసింగి, లేపాక్షి పర్యాటక అభివృద్ధికి, బౌద్ధ క్షేత్రాల వద్ద టెంట్ సిటీల ఏర్పాటుకు డీపీఆర్‌లను సమర్పించనున్నారు. తిరుపతి, విశాఖపట్నంలను దేశంలోని 50 ఐకానిక్ పర్యాటక కేంద్రాల జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేయనున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక సూచన మేరకు తెలుగు భాషా చరిత్రలో అద్భుత గ్రంథమైన 'సూర్యరాయాంధ్ర నిఘంటువు'ను ఆధునిక సాంకేతికతతో పునర్ముద్రించేందుకు కేంద్ర సహాయాన్ని మంత్రి కోరనున్నారు. 1.1 లక్షల పదాలతో కూడిన ఈ నిఘంటువును నేటి తరం చదువరులకు అందుబాటులోకి తేవడం ద్వారా తెలుగు భాషా వైభవాన్ని చాటాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. రాజమండ్రిలో 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తెలుగు పద్య నాటకం, వీధి నాటకాలకు పునర్జీవం పోయాలని మంత్రి దుర్గేష్ ప్రతిపాదించనున్నారు. దీనితో పాటు విశాఖపట్నంలో లలిత కళా అకాడమీ ప్రాంతీయ కేంద్రం, విజయవాడ ఘంటసాల సంగీత కళాశాలలో 'కళాక్షేత్ర' ఆడిటోరియం నిర్మాణం, అమరావతిలో సాహిత్య అకాడమీ కేంద్రం ఏర్పాటుపై కీలక చర్చలు జరపనున్నారు. అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి కోసం విశాఖలో ఐసీసీఆర్‌బ్రాంచ్ ఏర్పాటు అత్యవసరమని కేంద్రానికి వివరించనున్నారు. ఈ ఢిల్లీ పర్యటన ఏపీ పర్యాటక రంగానికి కొత్త ఊపునిస్తుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర మద్దతుతో మౌలిక సదుపాయాలు మెరుగుపడితే, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.



# ఐదుకోట్ల ఆంధ్రులు గర్వించే రోజు

**అమరావతికి లోక్‌సభ ఆమోదంపై లోకేశ్ ట్వీట్**

**అమరావతి,ఏప్రిల్ 1:** రాజధాని అమరావతి ప్రాంతంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని అంటూ లోక్ సభ ఆమోదం తెలపడంతో సందడి మొదలైంది. వైసీపీ మినహా సభలోని అన్ని పార్టీలు రాజధానిగా అమరావతికే ఓటేశాయి. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించే చరిత్రాత్మక రోజు ఇదంటూ సంతోషం వ్యక్తం చేశారు. 'నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్– నా రాజధాని అమరావతి అని ఐదు కోట్ల ఆంధ్రులు గర్వంగా నినదించే చరిత్రాత్మకమైన రోజుకు దేశ పార్లమెంట్ వేదిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఒకే రాష్ట్రం– ఒకే రాజధాని నినాదంతో అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానానికి చట్టబద్ధత కల్పించే అమరావతి బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, ఆమోదించడం కోట్లాది ప్రజలు గర్వించదగ్గ సందర్భం. అమరావతి, కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన పార్టీలకు కృతజ్ఞతలు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష. అమరావతి విజయం.. ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయం. ఇది రైతుల త్యాగాలకు దక్కిన దైవ ఆశీస్సులు. శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితం. కోట్లాది ప్రజల కోరికను గౌరవించిన కేంద్రం ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా చరిత్ర–సంస్కృతికి ఆలవాలమైన అమరావతిని నిలిపింది. జై ఆంధ్రప్రదేశ్.. జయహో అమరావతి..' అంటూ మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు. ఎపీ రాజధాని అమరావతికి లోక్ సభ ఆమోదం తెలపడంతో ఢిల్లీకి మంత్రి లోకేశ్ వెళ్లనున్నారు. ఇవాళ రాత్రికి ఆయన దేశ రాజధానికి బయలుదేరనున్నారు. బిల్లుకు సహకరించిన ఎంపీలు, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపనున్నారు. గురువారం నాడు రాజ్యసభలో బిల్లుపై చర్చ సమయంలో ఢిల్లీలోనే ఉండనున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ పర్యటనకు ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది

● భీమ్ భరత్

● ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన:

● చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్



**చేవెళ్ల ఏప్రిల్ 1 ( సమయం న్యూస్) :** చేవెళ్ల నియోజకవర్గం నవాబ్ పెట్ మండలంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఈరోజు ఘనంగా ప్రారంభించిన చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు..ఈ కార్యక్రమంలో నవాబ్ పెట్ మండలం అధ్యక్షులు వెంకటయ్య మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి , బి బ్లాక్ అధ్యక్షులు పోలీస్ మధుసూదన్ రెడ్డి ,ప్రభాకర్ రెడ్డి , నవాబ్ పేట సర్పంచ్ నరసింహా రెడ్డి , యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ , యూత్ కాంగ్రెస్ నాయకులు ఉపేందర్ రెడ్డి , మండల అధ్యకులు శేఖర్ , యాదయ్య , యావాపూర్ సర్పంచ్ లక్ష్మణ్ , పులుమామిడి సర్పంచ్, గ్రామ కమిటీ అధ్యక్షులు ఇందిరమ్మ కమిటీ మెంబెర్స్ సీనియర్ నాయకులు , స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా నిలిచే భరోసా

-- ముఖ్యమంత్రి సహాయనిధి: చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల ఏప్రిల్ 1 (సమయం న్యూస్) :** నవాబ్‌పూర్ మండలం ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 24 మంది లబ్ధిదారులకు 10 లక్షల 40వేల రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేసిన స్థానిక శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**చేవెళ్ల మున్సిపాలిటీ 3వ వార్డు (దేవుని ఎర్రవల్లి)లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య ప్రారంభించారు.**



**చేవెళ్ల ఏప్రిల్ 1 (సమయం న్యూస్) :** ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, ఈ రోజు మనందరికీ ఆనందదాయకమైన రోజు అని తెలిపారు. పేద ప్రజలకు గూడు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ లక్ష్యంతో నిర్మించిన ఈ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, గౌరవం, భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ, ఈ ఇంటి ద్వారా ఆ కుటుంబం సంతోషంగా, సురక్షితంగా జీవించాలని ఆకాంక్షించారు.మన ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి అర్హులైన కుటుంబానికి ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో కూడా ఇలాంటి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకటరెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ జువెనైల్ జస్టిస్ చట్టం, 2015 అమలుకు నోడల్ సంస్థగా వ్యవహరిస్తోంది.

● ఈ చట్టం పిల్లల భద్రత, సంక్షేమం కోసం ప్రధానంగా పనిచేస్తుంది.

**న్యూ డిల్లీ ఏప్రిల్1( సమయం న్యూస్) :** చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు (జఔజం) సంరక్షణ అవసరమైన పిల్లలపై నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని కలిగి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు మరియు యూటీలు చట్ట అమలుకు ప్రధాన బాధ్యత వహిస్తాయి.మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లా స్థాయిలో పర్యవేక్షణ, తనిఖీలు జరుగుతున్నాయి. నిబంధనలు పాటించని చైల్డ్ కేర్ సంస్థలపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రాలకు ఉంది.ఈ విషయాలను కేంద్ర మంత్రి సావిత్రి ఠాకూర్ రాజ్యసభలో వెల్లడించారు.

## హెల్మెట్ లేకుంటే మా గ్రామంలోకి రావొద్దు..!




ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా తమ గ్రామంలోకి రావొద్దని మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం వెంకట్రాంపురం గ్రామస్థులు గ్రామశివారులో మంగళవారం బ్యానర్ ఏర్పాటు చేశారు.

# రబీ (యాసంగి) 2025-26 ప్యాడీ కొనుగోళ్లకు సమగ్ర ఏర్పాట్లు చేయాలి

● జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట ఏప్రిల్1( సమయం న్యూస్). :** జిల్లాలో రబీ (యాసంగి) 2025-26 సీజన్‌లో ప్యాడీ కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు కొనుగోలు కేంద్రాల్లో ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో వరిధాన్యం సేకరణ, మద్దతు ధర అమలు అంశాలపై డీఆర్డీఓ, సహకార శాఖ, మెప్మా తదితర శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈసారి జిల్లాలో ధాన్యం దిగుబడి గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన మంచినీటి సదు-పాయం, టెంట్లు, బ్యానర్లు, ప్యాడీ క్లీనర్లు, రిజిస్టర్లు, టార్పాలిన్లు ఏర్పాటు చేయడంతో పాటు, కేంద్రం బార్డర్ వరకు స్పష్టంగా కనిపించేలా లైటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి నష్టపోకుండా ఎత్తైన ప్రదేశాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా చూడాలని, రైతులు పండించిన పంటను కల్లాల్లో బాగా ఆరబెట్టిన తర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేల రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా, రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా రైతులకు తెలియజేయాలని సూచించారు. ధాన్యాన్ని బాగా తూర్పారబెట్టిన తరువాత మాత్రమే కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించేలా చూడాలని, రైతులతో పూర్తి బాధ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కన్సెంట్ తీసుకోవాలని తెలిపారు.ఈ నెలలో ధాన్యం దిగుబడి అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్ మీటర్లు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రతిరోజూ ఉదయం ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి మధ్యాహ్నం కల్లా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల సామర్థ్యాన్ని బట్టి కేటాయించిన ధాన్యం దిగుమతి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, స్టోరేజ్ సామర్థ్యాన్ని ముందుగానే సమీక్షించుకోవాలని, అవసరమైతే అదనపు నిల్వ స్థలాన్ని సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎక్కడైనా లోపాలు తలెత్తితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలను ధృవీకరించడంలో నిర్లక్ష్యం వహిస్తే వ్యవసాయ శాఖ అధికారులపై కూడా తీవ్ర చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, సివిల్ సప్లై అధికారి తనూజ, డియం సివిల్ సప్లై అధికారి గోపీకృష్ణ, ఎల్డియం హరిబాబు, మార్కెటింగ్ అధికారి నాగరాజు, అడిషనల్ డిఆర్డిఏ సుధీర్ బాబు, మెప్మా పిడి హన్మంత్ రెడ్డి మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

● జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.



**నిర్మల్ ఏప్రిల్ 01( సమయం న్యూస్). :** ఈనెల నాలుగవ తేదీన (శనివారం) ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన, ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికైన కౌన్సిలర్లకు పార్టీల వారిగా సీటింగ్ ఏర్పాటు చేసి, త్రాగునీరు అందించాలని పేర్కొన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టి, తొలిసారి ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చినందున అదనపు కలెక్టర్ ను, మున్సిపల్ కమిషనర్, తదితర అధికారులు శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో సీపీవో జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రోడ్ల దుస్థితి దారుణం

-- ప్రభుత్వం విఫలం: వేముల ప్రశాంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 01( సమయం న్యూస్).:** రాష్ట్రంలో రోడ్లు, బ్రిడ్జిల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని మాజీ మంత్రి ఎవఎబశ్రీఖ౹ాతీఖంష్టుఖత్ష్ర =వనఎ తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయడానికి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.పంచాయతీ రాజ్, =ఒదీ శాఖల పరిధిలోని రోడ్లు పూర్తిగా పాడైపోయాయని, మోకాళ్ల లోతు గుంతల వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన అన్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా సరైన మరమ్మతులు చేపట్టలేదని ప్రభుత్వంపై ఆరోపించారు.ఆర్మూర్--బింగల్ మార్గంలో ఉన్న ప్రధాన బ్రిడ్జి దెబ్బతిన్నా ఇప్పటివరకు మరమ్మతులు చేయలేదని, సంబంధిత అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించలేదని విమర్శించారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ కేవలం 25 శాతం మాత్రమే విడుదల చేస్తున్నారని, దీనివల్ల పనులు నిలిచిపోయాయని తెలిపారు.తమ ప్రభుత్వం కాలంలో ఖ. జష్ట్రుఅనతీఖంష్ట్రవన్ఖతీ =ఖశీ నాయకత్వంలో రూ.25 వేల కోట్ల నిధులు విడుదల చేసి, ప్రతి సంవత్సరం సగటున రూ.2600 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ప్రస్తుతం కనీసం రూ.4000 కోట్లు అవసరమైన చోట రూ.1200 కోట్లు మాత్రమే విడుదల చేస్తున్నారని విమర్శించారు.అసెంబ్లీలో ఇచ్చిన సమాధానాల ప్రకారం 2070 కిలోమీటర్ల రోడ్ల పనులు మంజూరు కాగా కేవలం 112 కిలోమీటర్లు మాత్రమే పూ-ర్తయ్యాయని, ఇది 5 శాతం కూడా కాదని తెలిపారు. గత రెండేళ్లలో మొత్తం 300 కిలోమీటర్ల పనులు మాత్రమే జరిగాయని ఆరోపించారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 9 ఏళ్లలో 8439 కిలోమీటర్ల రోడ్లు అభివృద్ధి చేశామని, అలాగే భారీ స్థాయిలో =ఒదీ భవనాలు నిర్మించామని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో నిర్మించిన 125 అడుగుల ఐతీ. దీ. =. ాఎవఎన్ఖతీ క్ఖబవ దేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని అన్నారు.ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నావీ మోడల్ రోడ్లలో భారీ అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ, వేల కోట్ల రూపాయల స్కాం జరుగుతుందని విమర్శించారు. టెండర్లలో మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరిట ముందుగానే నిధులు విడుదల చేయడం అనుమానాస్పదమని పేర్కొన్నారు.రీజనల్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్‌లో ఆలస్యం జరుగుతుందని, అనుభవం లేని కంపెనీలకు పనులు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.చివరిగా, అమరవీరుల స్థూపం మరియు అంబేద్కర్ నిర్మాణాలకు వచ్చిన మంచి పేరును చెడగొట్టే ప్రయత్నాలు చేయవద్దని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

# ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సాగుచేస్తున్న రైతులను గుర్తించి భూ హక్కు పత్రాలను జారీ చేయండి.



**భూపాల పల్లి ఏప్రిల్1( సమయం న్యూస్) :** భూపాలపల్లి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న రైతులను నిర్ధారణ చేసి గుర్తించి భూ హక్కు పత్రాలు జారీ చేయుటకు చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.బుధవారం ఐడిఓసి కార్యాలయంలో భూపాలపల్లి డివిజన్ పరిధిలోని రెవెన్యూ మరియు అటవీ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు జారిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలాల వారిగా ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న రైతులు, భూ సమస్యల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మారావుపేట గ్రామంలోని రైతులు దీర్ఘకాలంగా సాగు చేస్తున్న భూమిలో సింగరేణి గనులు ఏర్పాటుతో కొందరు రైతులు భూములు కోల్పోయారని వారికి పరిహారం అందించాలని సూచించారు. గనులు ఏర్పాటు తదుపరి మిగిలిన భూములను సాగు చేస్తున్న రైతులకు భూ హక్కు పత్రాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సింగరేణి గనులు, జెన్కో పరిశ్రమ ఏర్పాటుతో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి సాగుచేస్తూ జీవనం సాగిస్తున్న రైతులకు గ్రామ సభలు నిర్వహించడం ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని తెలిపారు. కోర్టు వివాదాల్లో లేని భూములు జోలికి వెళ్లకుండా ఇతర భూములకు హక్కు పత్రాలు జారీ చేయాలని సూచించారు. దాదాపు 70 సంవత్సరాలుగా సాగులో ఉన్న రైతులకు కోర్టు కేసులు లేని పక్షంలో గ్రామ సభల ద్వారా భూ హక్కు పత్రాలు జారీ చేయాలని తెలిపారు. భూ హక్కు పత్రాలు లేకపోవడం వల్ల రైతులు రైతు భరోసా, రైతు భీమా వంటి ప్రయోజనాలను పొందలేకపోతున్నారని ఆయన తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కోర్టు వివాదాలు లేని భూములను లైసెన్స్ సర్వేయర్ల ద్వారా సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, ఆర్డిఓ హరికృష్ణ, భూపాలపల్లి డివిజన్ పరిధిలోని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర ఉద్యోగులకు 78వ వేతన సంఘం ఏర్పాటు.

# జీతాలు భారీగా పెరిగే ఛాన్స్

**న్యూ డిల్లీ ఏప్రిల్1( సమయం న్యూస్). :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘాన్ని (8th Central Pay Commission) ప్రభుత్వం ఏర్పాటు చేసింది.ఈ కమిషన్ తన సిఫార్సులను సమర్పించేందుకు 18 నెలల గడువు విధించింది. దీంతో లక్షలాది మంది ఉద్యోగుల జీతభత్యాలు,పెన్షన్ల సవరణకు మార్గం సుగమమైంది. కొత్త వేతనాలు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంటులో అధికారికంగా ధృవీకరించారు. 2025 నవంబర్ 3న 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. జీతాలు, అలవెన్సులు, పెన్షన్ నిర్మాణం వంటి పలు అంశాలపై ఈ కమిషన్ సమీక్షించి, 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన నివేదికను సమర్పిస్తుందని వివరించారు. నివేదిక రావడానికి 2027 మధ్యకాలం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, గత సంప్రదాయం ప్రకారం 2026 జనవరి 1 నుంచే బకాయిలతో సహా కొత్త జీతాలను వర్తింపజేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌దే కీలక పాత్ర ఈ వేతన సవరణలో 'ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్' అత్యంత కీలకం కానుంది.ఉద్యోగులందరి మూల వేతనాన్ని (Basic Pay) ఒకేసారి పెంచడానికి ఈ గుణకాన్నే ఉపయోగిస్తారు.7వ వేతన సంఘం 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను సిఫార్సు చేయగా, దానిని ప్రభుత్వం ఆమోదించింది. దీంతో అప్పుడు కనీస మూల వేతనం రూ. 7,000 నుంచి రూ. 18,000కు పెరిగింది. గరిష్ఠ వేతనం రూ. 2.5 లక్షలకు చేరింది.ఒకవేళ 8వ వేతన సంఘం కూడా ఇదే 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను కొనసాగిస్తే, ప్రస్తుతం రూ. 18,000గా ఉన్న కనీస మూల వేతనం సుమారు రూ. 46,000కు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.అయితే, ఉద్యోగుల ఆకాంక్షలు, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మధ్య సమతుల్యం సాధించాల్సి ఉంటుందని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు.ప్రభుత్వం సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. 7వ వేతన సంఘం గడువు 2025 డిసెంబర్ 31తో ముగియడంతో ఈ కొత్త కమిషన్‌ను నియమించారు.మూల వేతనంతో పాటు ఇతర అలవెన్సులు,ప్రస్తుతం 3 శాతంగా ఉన్న వార్షిక ఇంక్రిమెంట్లు,పెన్షన్ విధానంపైనా ఈ కమిషన్ తన సిఫార్సులను అందించనుంది. కమిషన్ నివేదిక, ప్రభుత్వ ఆమోదం తర్వాతే జీతాలు ఎంతమేర పెరుగుతాయనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

# "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?"

## -- పాఠశాల తనిఖీ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ ఆగ్రహం





**దమ్మపేట ఏప్రిల్ 1( సమయం న్యూస్).:** దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృత పర్యటన నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం, పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, ముఖ్యంగా మధ్యాహ్న భోజన నాణ్యతపై సమగ్రంగా ఆరా తీశారు.మొదటగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి, దరఖాస్తుల పరిష్కార విధానంపై అధికారులను ప్రశ్నించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి, కుల ధృవీకరణ, ఆదాయ, నివాస ధృవీకరణ, రేషన్ కార్డుల వంటి దరఖాస్తుల పురోగతిని తెలుసుకున్నారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. "మీ సేవ" ద్వారా చెల్లించవలసిన రుసుముల వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు.భూ సమస్యలు, సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాల్సి ఉండగా, ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి ఎందుకు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తోందని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డు రూమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై, విద్యుత్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, వ్యవసాయం, పోలీస్ శాఖల పనితీరును సమీక్షించారు. గ్రామసభల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని, వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం దమ్మపేట తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్,ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు. మెనూ ప్రకారం ఆ రోజు చికెన్ బగారా రైస్ అందించాల్సి ఉండగా, అది అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, మెనూ పాటించకపోవడంపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు అందించవలసిన ఆహారాన్ని ఎందుకు ప్రదర్శించడం లేదని వెంటనే ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా రుచి చూసిన కలెక్టర్, ఆహార నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?" అని ప్రశ్నిస్తూ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్మేకర్ కూర సరిగా నువ్వ ఉడక పోవడం , రుచి, నాణ్యత లోపించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందించాలని, భవిష్యత్తులో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశంలో కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతున్న పరిస్థితిని గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు, భద్రతా చర్యలపై ఆరా తీసి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, ఉపాధ్యాయురాలు స్టెల్లా, వార్డెన్ దుర్గ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ముగిసిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

● జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి డా.ఓలేటి జ్యోతి

**మహబూబాబాద్,ఏప్రిల్.01( సమయం న్యూస్).:** జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్.టి.ఆర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు 18 మండలాల నుంచి 121 మంది విద్యార్థులు హాజరై పోటీలలో పాల్గొన్నారని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి డా.ఓలేటి జ్యోతి తెలిపారు.ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ..తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో నాలుగవ తరగతి ప్రవేశం పొందేందుకు మూడవ తరగతి చదువుతున్న బాలబాలికలకు వివిధ అంశాల్లో 9 రకాల పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, షటిల్ రన్, 800 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి, వారి ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించామన్నారు. ఈ పోటీలలో జిల్లా స్థాయిలో ఎంపికైన 10 మంది బాలికలు, 10 మంది బాలురకు ఏప్రిల్ 27 నుంచి హకీంపేట క్రీడా ప్రాంగణంలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారన్నారు.

# ఘనంగా మన పోలీస్ -మన ఊరు కార్యక్రమం

● తిమ్మక్కపల్లిలో సీసీ కెమెరాలు, క్రీడా పోటీలు ప్రారంభించి, మొక్కల నాటిన సీపీ రష్మి పెరుమాళ్.



**రాయపోల్, ఏప్రిల్ 1:**ప్రజలతో పోలీసుల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "మన పోలీస్ -- మన ఊరు" కార్యక్రమం రాయపోల్ మండలం తిమ్మక్కపల్లి గ్రామంలో వేడుక వాతావరణంలో బుదవారం ఘనంగా నిర్వహించారు.సిపి రష్మి పెరుమాళ్ కు గ్రామస్తులు బ్యాండు మేలా ,మంగళ హారతుల తో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో 16 సీసీ కెమెరాలు ,పెద్దమ్మ దేవాలయంలో మొక్కలు నాటారు.అనంతరం ప్రాథమిక పాఠశాలలో క్రీడా పోటీలు ప్రారంభించారు. అలాగే విద్యార్థులకు నోట్ బుక్స్, పరీక్ష ప్యాడ్లు,పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న చిన్నపాటి ఘటనలను కూడా గుర్తించి నివారించడంలో సీసీ కెమెరాలు కీలకంగా ఉంటాయని ఆమె తెలిపారు. ప్రజల ఆస్తి, ప్రాణ భద్రత కోసం ఈ చర్యలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.తదుపరి యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు వివిధ క్రీడా పోటీలు ఉపయోగ పడుతాయన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ,ఐకమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని సూచించారు.ఇక పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటి, హరిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ముఖ్యమని సూచించారు.పోలీస్ వ్యవస్థ ప్రజల కోసం ఉందని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడడంలో గ్రామస్తుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్ రెడ్డి, ఉపసర్పంచ్ ప్రవీణ్,అడిషనల్ సిపి లు కుషాల్ కర్,సుభాష్ చంద్రబోస్,ఆయేషా,గజ్వేల్ ఏసిపి నర్సింలు,సిఐ లతీఫ్,ఎస్ఐ మానసా పోలీస్ సిబ్బంది గ్రామస్తులు,పాల్గొన్నారు.

## ఆంగన్‌వాడీ సేవల పర్యవేక్షణకు 'పోషణ్ ట్రాకర్' యాప్ -- కేంద్ర ప్రభుత్వ కీలక చర్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ( సమయం న్యూస్). :** మహిళలు మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆంగన్‌వాడీ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు 'పోషణ్ ట్రాకర్' డిజిటల్ అప్లికేషన్‌ను ప్రవేశపెట్టినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ యాప్ ద్వారా ఆంగన్‌వాడీ కేంద్రాలు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కార్యకలాపాలను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించడం జరుగుతోంది.సప్లిమెంటరీ న్యూట్రిషన్ లబ్ధులు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చూడటంతో పాటు, డూప్లికేషన్ మరియు లీకేజీలను నివారించేందుకు 2024 ఆగస్టులో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఫ్‌=ా)ను ప్రవేశపెట్టారు. మొదటగా ఆంధ్రప్రదేశ్ సహా ఆరు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి, 2024 డిసెంబర్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించారు.'మిషన్ సక్షమ్ ఆంగన్‌వాడీ ం పోషణ్ 2.0' కింద నమోదు అయిన 6 సంవత్సరాల లోపు పిల్లలకు వ-ఖ్‌జ లేదా ఫ్‌=ా అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వారి తరఫున తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఈ ప్రక్రియ పూర్తి చేసి లబ్ధులను పొందవచ్చు.డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అన్ని బయోమెట్రిక్ వివరాలు సురక్షితంగా నిర్వహించబడుతున్నాయని అధికారులు తెలిపారు. డేటా ట్రాన్స్‌మిషన్ ఎన్క్రిప్షన్, యాప్ డేటాబేస్ రక్షణ, ఫేస్ డేటా సురక్షిత ప్రాసెసింగ్ వంటి పలు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా, యాప్‌లో నిల్వ అయ్యే తాత్కాలిక డేటా లాగ్ అవుట్ సమయంలో పూర్తిగా తొలగించబడుతుంది.2026 ఫిబ్రవరి నాటికి ఫ్‌=ా ద్వారా 4.77 కోట్ల లబ్ధిదారులను గుర్తించగా, అందులో 97.01% మంది వ-ఖ్‌జ మరియు ఫేస్ మ్యాచింగ్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.ఆంగన్‌వాడీ కార్యకర్తలకు నిరంతర శిక్షణ అందిస్తూ, సాంకేతిక సమస్యల పరిష్కారానికి కేంద్ర మరియు రాష్ట్ర స్థాయిలో సహకారం అందిస్తున్నారు. 'పోషణ్ భీ పడాయ్ భీ' కార్యక్రమం కింద వేలాది శిక్షకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.ఈ వివరాలను కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ రాజ్యసభలో ప్రశ్నకు సమాధానంగా వెల్లడించారు.

## పారాక్వాట్ గడ్డిమందుపై రాష్ట్రంలో 60 రోజుల నిషేధం



రాష్ట్రంలో పారాక్వాట్ గడ్డిమందు అమ్మకాలపై ప్రభుత్వం నిషేధ ఉత్తర్వులు జారీ ఇప్పటికే ఇదే అంశంపై కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం అమ్మకాలు, నిల్వలు, వినియోగంపై 60 రోజుల పాటు పూర్తి నిషేధం నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి తుమ్మల హెచ్చరిక రైతులు, వ్యాపారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచన

## ఎం ఎం సీ పరిధిలోని సర్కిల్ కార్యాలయాలలో విజిలెన్స్ అధికారుల సోదాలు

**హైదరాబాద్ ఏప్రిల్ 1( సమయం న్యూస్). :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోన్ పరిధిలోని సర్కిల్ కార్యాలయాలలో బుధవారం ఉదయం విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల బృందం సోదా నిర్వహించారు. హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయాలలో అటెండెన్స్ రిజిస్టర్లతో పాటు పలు రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు. కార్యాలయంలోని అధికారులు, సిబ్బందిని ఒకొక్కరిని పిలిచి వివరాలు సేకరిస్తున్నారు.



ఆదిలాబాదు జిల్లా బిసి అభివృద్ధి అధికారిగా ధారావత్ సోనియా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ ద్వారా కార్యకలాపాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు అయ్యేలా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

## అసిస్టెంట్ ట్రెజరీ అధికారి( ఏ టి ఓ) గా అజహర్ షరీఫ్



**భూపాప పల్లి ఏప్రిల్ 01( సమయం న్యూస్). :** భూపాలపల్లి ట్రెజరీ కార్యాలయంలో ఉప-కోషాధికారిగా విధులు నిర్వహిస్తున్న అజహర్ షరీఫ్‌కు సహాయ కోశాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ రాష్ట్ర ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్, హైదరాబాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు జారీ చేసిన ఆదేశాల ప్రకారం, అజహర్ షరీఫ్ తన ప్రస్తుత విధులతో పాటు సహాయ కోశాధికారిగా అదనపు బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు. శాఖ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు ఈ నియామకం దోహదపడుతుందని డిటిఓ జ్యోతిరావు తెలిపారు.అజహర్ షరీఫ్ గతంలో కూడా తన విధులను సమర్థంగా నిర్వహించిన అనుభవం ఉండటంతో, కొత్త బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సహాయ కోశాధికారి పదవీ బాధ్యతలు చేపట్టిన అజహర్ షరీఫ్ ను సిబ్బంది అభినందించారు.

## ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది.

**న్యూ డిల్లీ ఏప్రిల్ 1( సమయం న్యూస్). :** ఈ బిల్లు ద్వారా 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి సవరణ చేసి, రాష్ట్ర నూతన రాజధానిగా 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చనున్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా, కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపింది. వైసీపీ పార్టీ వాకౌట్ చేసింది. ఈ బిల్లు ఆమోదంతో అమరావతి రాజధాని అంశానికి చట్టపరమైన ముద్ర పడటమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధి దిశలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుంది.రాజధాని అమరావతికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు లోక్‌సభలో తెలిపిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిఅమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ ఎంపీ మల్లు రవిఢిల్లీ 'ఏపీ పునర్విభజన చట్ట సవరణ బిల్లు-2026'ను ఏకగ్రీవంగా ఆమోదించిన లోక్‌సభ..!బిల్లుకు వైసీపీ మినహా, అన్ని పార్టీల మద్దతు..!

రేపు రాజ్యసభ ముందుకు 'ఏపీ పునర్విభజన చట్ట సవరణ బిల్లు-2026'.

# కిషోర్ బాలికల ఆరోగ్య రక్షణకు HPV టీకా తప్పని సరిగా వేయించుకోవాలి

- దౌల్తాబాద్ వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రదర్శిని



**దౌల్తాబాద్ మండలం, ఏప్రిల్,01(సమయం న్యూస్) :** కిషోర్ బాలికలు (15 సంవత్సరాలు) భవిష్యత్ లో "క్యాన్సర్" బారిన పడకుండా HPV టీకా ( హుమన్ పాపిలోమా వైరస్) తప్పనిసరిగా వేయించుకోవాలని దౌల్తాబాద్ వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని తెలిపారు. బుధవారం నాడు క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి బాలికలకు ఉచితంగా హెచ్.పి.వి(HPV) టీకాలు వేశారు. ఇట్టి కార్యక్రమం లో రఫీ సూపర్ వైజర్,ఏఎన్ఎంలు అనిత, భీమమ్మ పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రములకు టెండరు ఆహ్వానం జిల్లా సంక్షేమ అధికారి సబిత

**మహబూబాబాద్, ఏప్రిల్.01( సమయం న్యూస్).:** మహబూబాబాద్ జిల్లాలోని (05) ఐ.సి.డి .యస్. ప్రాజెక్ట పరిధిలోని అంగన్వాడి కేంద్రములకు అవసరమైన "50 అంగన్వాడి కేంద్రంలకు (RO water filters and BALA Painting) కొనుగోలు చేయుటకు ఆసక్తి గల ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ నందు రిజిష్టర్డ్ అయిన వ్యాపారస్తుల నుండి టెండర్ కోరనైనదని జిల్లా సంక్షేమ అధికారి సబి త నేడు ఒక ప్రకటన లో తెలిపారు. టెండరు ను తేది.02.04.2026 నుండి 07.04.2026 సాయంత్రం 5.00 గం. ల లోపు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దాఖలు చేయాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్.
- ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు,
- సమావేశాలు,బహిరంగ కార్యక్రమాలు,సభలు జిల్లాలో నిషేధం.



**నారాయణపేట,ఏప్రిల్,01(సమయం న్యూస్):** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారా య ణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...30 పోలీస్ ఆక్ట్ ఏప్రిల్ 30వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

# కొండాపూర్ శివారులో రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

- అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్



**పెద్దేముల్ మండలం,ఏప్రిల్ 01(సమయం న్యూస్) :** తాండూర్ నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని కొండాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే:ఈ రోజు ఉదయం సుమారు 2 గంటల ప్రాంతంలో కొండాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందన్న ముందస్తు సమాచారం మేరకు పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ వర్ధన్ మాట్లాడుతూ..నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుబడిన ట్రాక్టర్ల యజమానులపై ఇప్పటికే కేసులు నమోదు చేశామని, ప్రస్తుతం ఈ విషయంపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతోందని ఆయన వెల్లడి ంచారు. ప్రభుత్వ సంపదను అక్రమంగా తరలించే వారిపై నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ప్రవేశ పరీక్షా

- కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ప్రవేశం కొరకు
- జిల్లా విద్యాశాఖాధి కారి ఎక్స్ ఆఫిసియోడిపివో, ఎస్ ఎస్ వికారాబాద్ జిల్లా



**వికారాబాద్, ఏప్రిల్,01(సమయం న్యూస్) :** 2026-27 విద్యాసంవత్సరానికి జిల్లాలో (03) KGBV వికారాబాద్, KGBV కోడంగల్ మరియు KGBV దోమ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో KGBV (YIIOE) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, (ఇంగ్లీషు మీడియం-MPC/BPC/CEC Groups) ప్రవేశము కొరకు తేది.03.05.2026 నాడు జరుగు TGRJC CET 2026 ఉమ్మడి ప్రవేశ పరీక్ష కు మార్చి 2026 లో 10వ తరగతి పరీక్షకు హాజరైన విద్యార్థినుల నుండి (https://tgric.cgg.gov.in/TGRIC) ఆన్ లైన్ ద్వారా తేది : 16.03.2026 నుండి తేది: 15.04.2026 వరకు కోరబడుచున్నవి. దరఖాస్తు రుసుము రూ.200/- ప్రవేశ పరీక్షలో ప్రతిభ మరియు కె.జి.బి.వి. మార్గదర్శకాల ప్రకారం విద్యార్థుల ఎంపిక జరుగును. ఈ కళాశాలలో IIT-JEE, NEET-Medical, EAPCET (Engineering & Other Medical courses లలో ప్రత్యేక ఫ్యాకల్టీ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఉచిత భోజనం, వసతితో పాటు స్టడీ మెటీరియల్, రిఫరెన్స్ బుక్స్ తో గల లైబ్రరీ, సైన్స్ మరియు కంప్యూటర్ లాబ్స్, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఇతర వివరాల కొరకు (https://tgrjc.cgg.gov.in/TGRIC) లో పొందు పర్చిన బులెటిన్ చూడవచ్చును. వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబరు : 8333958595.

జిల్లా విద్యాశాఖాధి కారి ఎక్స్ అఫిసియో & డిపివో, ఎస్ ఎస్ వికారాబాద్ జిల్లా

# ఓపీ, ఐపీ కేసులు-రోజూవారి సేవలపై ప్రత్యేక దృష్టి

- విద్యార్థినులకు పోషకాహారం అందించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జాఫర్ ఘడ్ ఏప్రిల్1( సమయం న్యూస్) :** బుధవారం, జిల్లాలోని జఫర్గడ్ మండల పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోజూ వారిగా వస్తున్న ఓపీ (ఔట్ పేషెంట్), ఐపీ (ఇన్ పేషెంట్) కేసుల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల కేసులు, గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో చర్చించారు. ప్రసవాల సంఖ్యను మరింతగా పెంచాలని సూచించారు. వార్డుల్లో రోగులకు అందుతున్న చికిత్సపై ఆరా తీశారు .డెంటల్ విభాగం, స్కానింగ్ సెంటర్ పనితీరును పర్యవేక్షించారు. ఔషదాల నిల్వలను పరిశీలించి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు. డయాలసిస్ తీసుకుంటున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న సేవల గురించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాల పరిసరాల పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. రక్త నమూనాల సేకరణ, నిల్వ విధానాలను తనిఖీ చేసి, సరైన ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ క్రమంలో మౌలిక వసతులు మె-రుపరచాలని, వైద్యులు, సిబ్బంది సమయానుగుణంగా అందుబాటులో ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జఫర్గడ్ మండలంలోని సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలను కలెక్టర్ సందర్శించి, వంటశాలను తనిఖీ చేశారు. వంటకు ఉపయోగించే సామాన్లు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం పరిశుభ్రంగా ఉండాలని, పోషకాహారం అందించాలని సూచించారు. పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్ వినియోగాన్ని కూడా పర్యవేక్షించారు. పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడి, రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 15 లోపు హెచ్.ఎల్.బీ బ్లాక్ నిర్ధారణ పూర్తి


- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- జనగణన 2027 పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, ఏప్రిల్ 01( సమయం న్యూస్) :** జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 15 లోపు హెచ్.ఎల్.బీ బ్లాక్ నిర్ధారణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం జనగణన 2027 పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జనగణన 2027 రెండు దశలలో జరుగుతుందని, ప్రస్తుత సంవత్సరం హౌజ్ లిస్టింగ్ కార్యక్రమం మే 10 నుంచి ప్రారంభం అవుతుందని, ప్రతి ఇంటికి సంబంధించి 35 ప్రశ్నల వివరాలు నెల రోజుల వ్యవధిలో సేకరించాలని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 2027 లో హౌస్ లిస్టింగ్ ప్రకారం జనాభా వివరాల సేకరణ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి 300 ఇండ్లు/800 జనాభా ఒక బ్లాక్ గా (హెచ్.ఎల్.బీ) నిర్దేశించి జనాభా లెక్కల చేసేందుకు బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఫీల్డ్ సర్వే సమయంలో మనం వేసుకునే అంచనా కంటే ఎక్కువ ఇండ్లు ఉండే అవకాశం ఉన్నందున 15 శాతం అధికంగా ఎన్యుమరేటర్లు నియామకం చేపట్టాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో హెచ్.ఎల్.బీ లు మరింత పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల వారీగా ఏర్పాటు చేయనున్న హెచ్.ఎల్.బీ. పేపర్ మీద రిపోర్ట్ సిద్ధం చేసుకొని ఆన్ లైన్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి హెచ్.ఎల్.బీ పరిధిలో ఉన్న ఇండ్లు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, ఆట స్థలాలు, ఆసుపత్రులు ఏం ఉన్నాయో సరిగ్గా ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. హెచ్.ఎల్.బీ ప్రక్రియ ఎంత పకడ్బందీగా చేసుకోగలిగితే రాబోయే 1.5 సంవత్సరాల కాలం పాటు జనాభా లెక్కల కార్యక్రమం అంత ప్రశాంతంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. హెచ్.ఎల్.బీ విభజన రాబోయే 10 రోజులలో తహసిల్దారులు స్థానిక పంచాయతీ కార్యదర్శి మున్సిపల్ కమిషనర్ల సహకారంతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 200 నుంచి 300 ఇండ్లు ఉన్న చిన్న చిన్న గ్రామ పంచాయతీలు, వార్డుల హెచ్.ఎల్.బీ ఆన్ లైన్ ఎంట్రీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ 15 లోపు తుది హెచ్.ఎల్.బీ నిర్ధారణ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్.ఎల్.బీ ఆన్ లైన్ ఎంట్రీ సమయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. జనగణన 2027 కార్యక్రమం చాలా ముఖ్యమైన అంశమని, దీనిని ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. హౌస్ లిస్టింగ్ నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 1400 ఎన్యుమరేటర్లు అవసరం ఉంటుందని అంచనా వేశామని, ప్రతి గ్రామం మున్సిపాలిటీ పరిధిలో ఎంతమంది ఎన్యుమరేటర్ అవసరం ఉన్నారో వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డిఓ లు బి. గంగయ్య, సురేష్ , ఎంపీడీవోలు, తహసిల్దారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులే పాలకులు.. హస్నాబాద్ పాఠశాలలో సందడిగా 'స్వపరిపాలన దినోత్సవం'

- ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి రామ్ రెడ్డి



**దుద్యాల్,మండలం, ఏప్రిల్,01(సమయం న్యూస్) :** నేటి విద్యార్థులే రేపటి పౌరులు.. వారికి పరిపాలన పట్ల అవగాహన ఉంటేనే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హస్నాబాద్ విద్యార్థులు నిరూపించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలంలోని హస్నాబాద్ గ్రామ ఎంపీయుపిఎస్ (ఉర్దూ మీడియం) పాఠశాలలో బుధవారం 'స్వపరిపాలన దినోత్సవం' అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. పాఠశాల ఆవరణ అంతా విద్యార్థుల సందడితో, బుజ్జి అధికారుల హడావుడితో కళకళలాడింది. అధికారుల పాత్రల్లో అదరగొట్టిన విద్యార్థులు ఈ సందర్భంగా విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అంతేకాకుండా విద్యాశాఖలోని కీలక పదవులైన డీఈఓ (ఇజూా), ఎంఈఓ (వీజూా), హెడ్మాస్టర్ వంటి పాత్రలను పోషించి అందరినీ ఆశ్చర్యపరిచారు. పాఠశాల పరిపాలన సాగించే విధానాన్ని, సమస్యల పరిష్కారాన్ని వారు ప్రదర్శించిన తీరు కళ్ళకు కట్టినట్లు ఉంది. విద్యార్థుల క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ పటిమను చూసి గ్రామస్తులు, తల్లిదండ్రులు ముగ్ధులయ్యారు. నాయకత్వ లక్షణాలకు ఇది తొలిమెట్టు: ఎంఈఓ రామ్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి (వీజూా) రామ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను వెలికితీయడానికి ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని అన్నారు. బాధ్యతాయు-ంతమైన పౌరులుగా ఎదగడానికి స్వపరిపాలన దినోత్సవం ఒక చక్కని పునాది అని ఆయన కొనియాడారు. విద్యార్థులు ఇప్పట్నుంచే సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. వివిధ ప్రముఖులు పాల్గొని ప్రోత్సాహంఈ వేడుకలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాలిబ్ అహ్మద్ అధ్యక్షత వహించగా, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ నర్సిములు, పీఆర్టీయూ కోడంగల్ మండల అధ్యక్షులు అబ్దుల్ హక్, ప్రధాన కార్యదర్శి దినేష్ సింగ్ పాల్గొని ప్రసంగించారు. పొరుగు పాఠశాలల హెడ్మాస్టర్లు ఎస్. రత్నకళ, అబ్దుల్ సలాం మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.

# గ్రామ సభలలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి

- గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 01:** వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ అబద్దాల పునాదుల మీద రాజ్యమేలుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ ప్రజలను మోసం చేసిందన్నారు, రేపు జరగబోయే గ్రామ సభలలో ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన అమలు కానీ 420 హామీలపై,6 గ్యారెంటీలపై, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గ్రామసభలలో నిలదీసి వైఫల్యం ఎండ కట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ ఎమ్మెల్యేలను తమ మంత్రులను గ్రామ సభలోకి వెళ్లకుండా, అధికారులతోనే గ్రామ సభలు జరపాలని నిర్ణయించడంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్ అయిందని తెలిపారు, కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రజా పాలన పేరిట వికలాంగులకు 6000 పెన్షన్ ఇస్తామని మోసం చేసిందని, కళ్యాణ లక్ష్మి లక్ష తో పాటు తులంబంగారం ఇస్తామని చెప్పి మోసం, విద్యార్థినిలకు స్కూటీల పంపిణీ చేస్తామని మోసం చేసిందని, తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికీ 2500 ప్రతినెల ఇస్తామని చెప్పి మోసం చేసిందని, వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులకు 4000 పెన్షన్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు రైతులకు ప్రతి ఎకరానికి 15000 ఇస్తామని చెప్పి మోసం, రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయడంలో మోసం, రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సరఫరా పంపించింది చేయడంలో మోసం, రైతాంగానికి 24 గంటల కరెంటు ఇవ్వడంలో మోసం, రైతుల పండించిన పంటలను గిట్టుబాటు ధరలు కల్పిస్తూ కొనుగోలు చేయడంలో మోసం, రైతులకు బోనస్ ఇస్తామని రైతులను మోసం, రైతులకు కూలీ రైతులకు పెట్టుబడి సహాయం ఇస్తామని చెప్పి మోసం చేసిన ఘనత కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు, ఆటో డ్రైవర్లకు 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. చదువుకున్న నిరుద్యోగులకు నెలకు 4000 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి మోసం చేశారన్నారు, ఐదు లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు,దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 12 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి మోసం చేశారన్నారు, కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు, బీసీల కోసం గత బడ్జెట్లో ప్రవేశపెట్టిన నిధులు సున్నా శాతం కూడా బీసీలకు ఇవ్వలేదని బీసీలను కూడా మోసం చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మోసపూరిత ప్రభుత్వం అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి అసమర్థ విధానాల వలన గ్రామాలలో పారిశుద్ధ్యం పడకేసిందన్నారు, గ్రామాలలో అభివృద్ధి కుంటు, గ్రామాభివృద్ధికి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిధులను పంచాయతీలకు మంజూరు చేయడం లేదని తెలిపారు, పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు రాలేక అల్లాడుతున్నారని కనీసం పారిశుద్ధ కార్మికులకు జీతాలు ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కాబట్టి గ్రామాలలోని ప్రజలు బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు గ్రామ సభలలో కాంగ్రెస్ హామీలపై ఆరు గ్యారెంటీ లపై నిలదీయాలని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు

# పరిగిలో అక్రమ గ్యాస్ సిలిండర్లు, కుళ్ళిన మాంసం మరియు కల్తీ ఐస్‌క్రీమ్ కేంద్రాల పైన టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు

## వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,IPS అదేశాలమేరకు.

**పరిగి మున్సిపల్,ఏప్రిల్,01(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే అన్వర్ పాషా మరియు వారి బృందం పరిగి పట్టణ పరిధిలో నిర్వహించిన ఈ దాడులలో అక్రమ గ్యాస్ సిలిండర్ల నిల్వ, కుళ్ళిన మాంసం విక్రయం మరియు నిబంధనలకు విరుద్ధంగా ఐస్‌క్రీమ్‌ల తయారీ చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.మొదటి ఘటనలో, పరిగి విద్యానగర్ కాలనీకి చెందిన కృష్ణ (35) అనే వ్యక్తి తన నివాసంలో అక్రమంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ తనిఖీల్లో 5 నిండుగా ఉన్న సబ్సిడీ సిలిండర్లు, 4 ఖాళీ సిలిండర్లు మరియు 3 కమర్షియల్ నిండు సిలిండర్లతో కలిపి మొత్తం 12 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. రెండో ఘటనలో,పరిగి విద్యానగర్ కాలనీలో నివాసముండే మహ్మద్ ఖలీల్ (34) అనే వ్యక్తి తన మటన్ షాపునకు సంబంధించి సుమారు 35 కిలోల కుళ్ళిన మాంసాన్ని నిల్వ ఉంచినట్లు గుర్తించి, దానిని సీజ్ చేశారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.అదేవిధంగా, పరిగి మెయిన్ రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా, గడువు ముగిసిన ముడి సరుకులు మరియు పారిశ్రామిక రంగులు ఉపయోగించి





ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న శ్రీ నిత్య ఐస్‌క్రీమ్ యూనిట్‌పై పోలీసులు దాడి చేశారు. దీని నిర్వాహకుడు వికారాబాద్‌కు చెందిన వర్కాల హన్మంతు (45)నుంచి సుమారు కల్తీ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.మరో ఘటనలో సిద్ధార్థ కాలనీకి చెందిన కె. రమేష్ (42) తన నివాసంలోనే తయారీ తేదీ, గడువు తేదీలు లేకుండా మహా ఐస్‌క్రీమ్ పేరుతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తుండగా పట్టుబడ్డారు. పట్టుబడిన నిందితులందరినీ తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పరిగి పోలీస్ స్టేషన్‌కు అప్పగించి,కేసులు నమోదు చేసి నట్లు ఎస్పీ స్నేహ మెహ్రా వెల్లడించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మాట్లా డుతూ,"ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఎటువంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించము. కేవలం లాభాల కోసం కల్తీ ఆహార పదార్థాలు తయారు చేయడం, గడువు ముగిసిన లేదా కుళ్ళిన పదార్థాలను విక్రయించడం చాలా తీవ్రమైన నేరం. ఇలాంటి చర్యలు ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తాయి.అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ చేయడం కూడా చట్ట విరుద్ధమే కాకుండా, అగ్ని ప్రమాదాలకు దారితీసే ప్రమాదం ఉంది. ఇటువంటి నిర్లక్ష్య చర్యలు సమీప ప్రాంత ప్రజల భద్రతకు కూడా ముప్పుగా మారుతాయి. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.ప్రత్యేకంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాల నాణ్యతపై అధికారులు మరింత కఠినంగా నిఘా ఉంచుతున్నారు. హోటళ్లు, మాంసం దుకాణాలు,ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రాలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. లైసెన్సులు లేకుండా వ్యాపారం నిర్వహించడం లేదా నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు ఉంచడం పట్ల కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాయి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు," అని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు.
- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్. వినిత్ ఐపీఎస్



**నారాయణపేట, ఏప్రిల్,01(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పరిధిలో మొత్తం 62 హనుమాన్ శోభాయాత్రలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు.హనుమాన్ శోభాయాత్రల సందర్భంగా ప్రధాన చౌరస్తాలు, సున్నిత ప్రాంతాల్లో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, నిరంతర పెట్రోలింగ్ నిర్వహించేందుకు పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం మానిటరింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.సోషల్ మీడియా ద్వారా రూమర్లు వ్యాప్తి చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా అనవసరమైన పోస్టులు చేసి సామాజిక విభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ర్యాలీల సమయంలో వీడియో రికార్డింగ్ నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని అవసరమైన చోట ట్రాఫిక్ డైవర్షన్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.పోలీస్ అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. హనుమాన్ జయంతి ర్యాలీల యువకులు సం యమనం పాటించాలని, ఉత్సవ కమిటీ నిర్వాహకులు వాలంటీర్లను ఏర్పాటు చేసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సంబంధిత స్థానిక పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.

# ప్రభుత్వ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలి

**- మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్**

**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 01 :** ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన సెట్విన్ ద్వారా తక్కువ ఖర్చుతో అందిస్తున్న స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణ కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్ సూచించారు. గజ్వేల్ పట్టణంలో సెట్విన్ సంస్థ ప్రారంభమై 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అతి తక్కువ ఖర్చుతో యువతకు అందిస్తున్న వివిధ కోర్సుల నైపుణ్య శిక్షణ కరపత్రాలను మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మందిరంలో కమీషనర్ వెంకట గోపాల్, పాలకవర్గంతో కలిసి ఆవిష్కరించారు. చైర్పర్సన్ చందన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ యువజన సేవల శాఖలో భాగమైన సెట్విన్ సంస్థ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల ప్రత్యేక చొరవతో గజ్వేల్ లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గజ్వేల్ ప్రాంత యువతి యువకులు అన్ని రంగాల్లో ముందుండాలన్న ఆలోచనతో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. సెట్విన్ ఇంచార్జ్ ఖదీర్ మాట్లాడుతూ గజ్వేల్ సెట్విన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రతి ఉద్యోగానికి అవసరమయ్యే విధంగా కంప్యూటర్ కోర్సు



లతోపాటు, స్వయం ఉపాధి కోర్సులను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ శిక్షణ సంస్థ ద్వారా ఎంఎస్ ఆఫీస్, డిటిపి, పిపిటిటిసి( ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్స్), మగ్గం (జర్దోజీ), గార్మెంట్ మేకింగ్, మెహందీ డిజైనింగ్, బ్యూటీషియన్, రిఫ్రిజిరేటర్ ఒ ఏ/సి రిపేర్, ఎలక్ట్రీషియన్, IP CCTV కెమెరా ఇన్స్టాలేషన్ కోర్సులను అతి తక్కువ ఫీజులతో శిక్షణ ఇవ్వడంతో పాటు టెక్నికల్ బోర్డు ఆమోదిత సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు. గజ్వేల్ ప్రాంత యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు గజ్వేల్ సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని గాని, 8790810172 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని కోఆర్డినేటర్ ఖదీర్ సూచించారు.వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు అత్తిలి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, గోలి మమతా సంతోష్, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, నాయిని సత్యలక్ష్మి యాదగిరి పాల్గొన్నారు.

# బకాయి పడిన మున్సిపల్ కార్మికుల వేతనాలు ఇవ్వాలని విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయింపు

- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ హామీతో ఆందోళన విరమణ
- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 01 :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల బకాయి పడిన ఆరు నెలల వేతనాలు, కార్మికులందరికీ ఈఎస్ఐపిఎఫ్ అమలు జరిపి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బుధవారం రోజున బకాయి పడిన ఆరు నెలల వేతనాలు ఇవ్వాలని విధులు బహిష్కరించి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయింపు చేయడం జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదని గతంలో ఉన్న మున్సిపల్ కమిషనర్, ప్రస్తుత మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని కానీ సమస్య పరిష్కరించడం జరగడం లేదని అన్నారు. ధరలు పెరిగి, కుటుంబ అవసరాలు పెరిగి కార్మికుల కుటుంబాలు తీవ్రమైన మనోవేదకు గురవుతున్నారని అన్నారు కార్మికుల పట్ల వివక్షత వివక్షతను పాటించడం జరుగుతుందని అన్నారు ప్రభుత్వ వెంటనే జోక్యం చేసుకుని జీతాలు ఇప్పించాలని కోరారు ఆందోళనతో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ గార్లు కార్మికుల వద్దకు వచ్చి 15 రోజుల్లో కార్మికులందరికీ బకాయి పడిన జీతాలు అందే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. మున్సిపల్ కార్మికుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సమీర్ గుంటుక శ్రీనివాస్ మద్దతు తెల్పడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సంగపురం యాదగిరి సురేందర్, శ్రీనివాస్, మల్లయ్య లక్ష్మి తదితరు పాల్గొన్నారు

# ఘనంగా గజ్వేల్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**-బార్ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తా**

**- బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ సాగర్**

**సమయం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 01 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ కోర్టు ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ సాగర్, నూతన పాలకవర్గం సభ్యులు ఎన్నికల అధికారులు సీనియర్ న్యాయవాదుల సమక్షంలో కిరణ్ సాగర్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు ఆయనతోపాటు నూతన కార్యవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం నిర్వహించారు, నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరైన న్యాయవాదులు వారికి అభినందనలు తెలిపారు, ఈ సందర్భంగా కిరణ్ సాగర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న న్యాయవాద మిత్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ, గజ్వేల్ బార్ అసోసియేషన్ గౌరవాన్ని మరింత పెంచడానికి, బార్ అసోసియేషన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, న్యాయవాదుల సమిష్టి కృషితో, న్యాయవాదుల



సంక్షేమానికి ఎల్లవేళలా ముందుంటామని, కోర్టులో త్వరితగతిన న్యాయం చేకూరే విధంగా అందరితో సమన్వయంతో పని చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నరేష్ చారి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, సహాయ కార్యదర్శి ఉమారాణి, కోశాధికారి అశోక్, క్రీడలు లైబ్రరీ అబ్దుల్ గఫార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామకృష్ణ, పరమేశ్వర్,అనూష,అంజలి, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు

# కోటపల్లి మండలం లోని మోత్కుపల్లి గ్రామ పంచాయతీ కి జాతీయ స్థాయి పంచాయతీ అవార్డు

- హర్షం వ్యక్తం చేసిన తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్,ఏప్రిల్,01(సమయం న్యూస్):** జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు ఇచ్చే ప్రతిష్టాత్మక " దీన్ దయళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల"కు గాను మన తెలంగాణ రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలు, వికారాబాద్ జిల్లా పరిధిలోని కోట్ పల్లి మండలము మోత్కుపల్లి గ్రామ పంచాయతీ మరియు సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండలము లోని ఫసల్వాడి గ్రామ పంచాయతీలు ఎన్నిక కాబడ్డాయి. ముఖ్యంగా, మన వికారాబాద్ జిల్లా కోట్ పల్లి మండలము మోత్కుపల్లీ గ్రామ పంచాయతీనకు "గుడ్ గవర్నన్స్" విభాగంలో అవార్డు రావడం జరిగింది. ఇందులో భాగంగా, గ్రామస్థులందరికి ఆన్లైన్ పౌర సేవలు అందించుట, భారత్ నెట్ మరియు (సీ ఎస్ సీ) సేవలు అందుబాటులో నుండుట,100% గ్రామ పంచాయతీ ఆదాయ వ్యయాలను, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను ఆన్లైన్ వెబ్సైట్ (వ-స్త్రతీఖుఎ ంఖుతీఖుం) లో పొందు పరుచుట. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు,ావీజీణ్, ావీ-వీఖణ=ూా,ావీ-ఖ×ూాచీ, ఖహీూాచీ+, వీ+చీ=జు+ూ(ఎదీ+ - =ూవీ+) మరియు,ావీ+-ణ×ూనూా వంటి పథకాలను డిజిటల్ ప్లాటఫోరమ్ ద్వారా పౌరులకు అందించుట. పారదర్శకంగా మరియు జవాబు దారితనం తో కూడుకున్న గ్రామ సభలు మరియు గ్రామ పంచాయతీ సమావేశాలను సమర్ధవంతంగా నిర్వహించుట తగిన గ్రామ పంచాయతీ రికార్డులను సమర్ధవంతంగా నిర్వహించినందుకు గాను ఈ అవార్డు లభించినందున, తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ హర్షం వ్యక్తం చేశారు మరియు మోత్కుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలకు,ఎంపీఓ,ఎంపీడీఓ, ,డీఎల్ పీఓ, మరియు డీపీఓ (జిల్లా పంచాయతీ అధికారి)లను అభినందించారు.

# పౌల్ట్రీ కంపెనీల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చికెన్ షాపుల బంద్

- గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చికెన్ సెంటర్ అసోసియేషన్ నిరసన

**సమయం న్యూస్ గజ్వేల్, 01 ఏప్రిల్ 2026 :** పౌల్ట్రీ కంపెనీల దౌర్జన్యపూరిత ధోరణిని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ఇచ్చిన రాష్ట్రవ్యాప్త బంద్ పిలుపులో భాగంగా, బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చికెన్ సెంటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చికెన్ సెంటర్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గత కొంతకాలంగా పౌల్ట్రీ కంపెనీలు వ్యాపారులకు ఇచ్చే మార్జిన్లను భారీగా తగ్గించి, పొట్ట కొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వహణ ఖర్చులు పెరిగి, లాభాలు లేక చికెన్ సెంటర్ల యజమానులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపారం చేయడం సాధ్యం కావడం లేదని వారు స్పష్టం చేశారు. పౌల్ట్రీ యాజమాన్యాలు వ్యాపారుల శ్రమను దోచుకుంటూ, అన్యాయమైన నిబంధనలతో ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. తగ్గించిన మార్జిన్లను వెంటనే పునరుద్ధరించి, వ్యాపారులకు న్యాయం చేసే వరకు మా నిరసన కొనసాగుతుందన్నారు. సమస్య పరిష్కార




మయ్యే వరకు షాపులను మూసి ఉంచడానికి వెనుకాడబోము అని సంఘం నాయకులు తేల్చి చెప్పారు. పౌల్ట్రీ కంపెనీల అన్యాయానికి వ్యతిరేకంగా తాము చేస్తున్న ఈ పోరాటంలో ప్రజలు, వినియోగదారులు సహకరించాలని అసోసియేషన్ కోరింది. సామాన్యుడికి తక్కువ ధరకు చికెన్ అందాలన్నా, చిన్న వ్యాపారులు బతకాలన్నా ఈ పోరాటం తప్పనిసరని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చికెన్ సెంటర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు ఇమామ్, హుస్సేన్, తిరుపతి, కార్యదర్శులు రాజు, ముస్తఫా, మాజీ అధ్యక్షులు శేఖర్, జహీర్, సభ్యులు బాలకృష్ణ, గౌస్, నాగరాజు, రఫీ, షాదుల్లా, సత్తయ్య, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

# చికెన్ షాపుల అసోసియేషన్ తో ప్రభుత్వం చర్చలు జరపాలి

- బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్.



**హైదరాబాద్, ఏప్రిల్ 1 సమయం న్యూస్ :** పౌల్ట్రీ యాజమాన్యం చికెన్ షాప్ పులకు ఇచ్చే మార్జిన్ 30 నుండి 16రూపాయలకు తగ్గించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల మంది చికెన్ షాపు నిర్వాహకులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు ఆయిలి వెంకన్న గౌడ్. తక్షణమే ప్రభుత్వం స్పందించి చికెన్ షాపు నిర్వాహకులతో చర్చలు జరిపాలని కోరారు, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ షాపు నిర్వాహకులు చేస్తున్న ఈ ఉద్యమంలో భాగస్వాములై ప్రజల్ని సమాయత్తం చేస్తామని హెచ్చరించారు. స్నేహ,సుగుణ, వెబ్ కాబ్ కంపెనీలు తెలంగాణ రాష్ట్రాన్ని ఆధిపత్యంగా చేసుకుని చేస్తున్న ఈ స్టెరాయిడ్ కృత్రిమ చికెన్ తయారీ పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే కోళ్ల ఫారాలు యజమానులు, మటన్, చాపల షాపు నిర్వాహకులు ఈ సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు జరిగే హనుమాన్ జయంతి వేడుకలు మరియు శోభాయాత్ర,

- ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి
- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశాలమేరకు



**వికారాబాద్, ఏప్రిల్,01(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లావ్యాప్తంగా రేపు నిర్వహించనున్న హనుమాన్ జయంతి వేడుకలు మరియు శోభాయాత్రల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం సర్వసిద్ధమైంది. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశానుసారం.. పరిగి, తాండూరు, వికారాబాద్ డివిజన్ల పరిధిలో డీఎస్పీలు, సీఐలు మరియు ఎస్సైల ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీలు, హనుమాన్ జన్మోత్సవ సమితి సభ్యులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, హనుమాన్ జయంతి శోభాయాత్రలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో జరగాలని సూచించారు. పోలీసులు నిర్దేశించిన మార్గాల్లోనే యాత్రలు సాగాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని కోరారు.ముఖ్యంగా శోభాయాత్రల్లో డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగానికి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు.యువత, నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శోభాయాత్ర సజావుగా సాగేందుకు పోలీసులు అన్ని విధాల సహకరిస్తారని, ప్రజలు కూడా పోలీసులకు మద్దతుగా నిలవాలని కోరారు. యాత్ర సాగే మార్గాల్లో సామాన్య ప్రజలకు, ముఖ్యంగా అంబులెన్స్ వంటి అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ఉత్సవ కమిటీలు తగిన సంఖ్యలో వాలంటీర్లను నియమించుకోవాలని సూచించారు. హనుమాన్ జయంతి వేడుకలు జిల్లాలో మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలని, ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే 'డైల్ 100' లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# సరుకు రవాణాలో కొత్త రికార్డు సృష్టించిన భారతీయ రైల్వేలు

**న్యూఢిల్లీ: ఏప్రిల్1( సమయం న్యూస్).:** భారతీయ రైల్వే 2025--26 ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణాలో మరో మైలురాయిని అధిగమించింది. ఈ ఏడాది మొత్తం 1670 మిలియన్ టన్నుల (మీ) సరుకును రవాణా చేసి, గత ఏడాదితో పోలిస్తే 3.25 శాతం వృద్ధి నమోదు చేసింది.రైల్వేలు నిర్వహించిన వాగన్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2024--25లో 2.79 కోట్ల వాగన్ల నుండి 2025--26లో 2.91 కోట్లకు పెరిగి 4.56 శాతం వృద్ధి సాధించాయి. ఇది దేశంలో రవాణా అవసరాలు పెరుగుతున్నాయన్న సంకేతంగా భావిస్తున్నారు.

ఈ వృద్ధికి ముఖ్యంగా ఎరువులు, పిగ్ ఐరన్ మరియు స్టీల్ రంగాలు కీలక పాత్ర పోషించాయి. ఎరువుల రవాణా 13.49 శాతం, పిగ్ ఐరన్ ఉ స్టీల్ రవాణా 13.11 శాతం పెరిగింది. ఇది వ్యవసాయం మరియు పరిశ్రమల అభివృద్ధిని ప్రతిబింబిస్తోంది.ఇంకా మౌలిక వసతుల రంగంలో కూడా రైల్వేలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇనుము ధాతువు రవాణా 6.74 శాతం పెరిగి 190.12 మీకు చేరుకోగా, సిమెంట్ రవాణా 4.74 శాతం పెరిగి 157.17 మీగా నమోదైంది. దేశవ్యాప్తంగా నిర్మాణ కార్యకలాపాలు వేగవంతమవుతున్నాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.జోన్ వారీగా చూస్తే, సౌత్ వెస్ట్రన్, నార్త్ సెంట్రల్, ఈస్ట్ కోస్ట్ మరియు వెస్ట్ సెంట్రల్ రైల్వేలు డబుల్ డిజిట్ వృద్ధిని నమోదు చేసి ముందంజలో నిలిచాయి. ఇతర జోన్లు కూడా స్థిరమైన పురోగతిని కనబరిచాయి.దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగమైన రైల్వేలు తక్కువ ఖర్చుతో, విశ్వసనీయమైన మరియు పర్యావరణ హిత రవాణా సేవలను అందిస్తూ, దేశ అభివృద్ధికి మరింత తోడ్పడుతున్నాయి.

## చందమామ నుండి సెల్‌ఫోన్ వరకు..

# పెరుగుతున్న ఆటిజం ప్రమాదం

### ఏప్రిల్ 2 -- ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

ఒకప్పుడు తల్లులు చందమామను చూపిస్తూ పిల్లలకు గోరుముద్దలు తినిపించేవారు. పిల్లలు తల్లిదండ్రులతో మాట్లాడుతూ, నవ్వుతూ, ఆడుకుంటూ ఆరోగ్యంగా పెరిగేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చిన్నారుల చేతిలో సెల్‌ఫోన్, ట్యాబ్‌లు పెట్టి భోజనం పెట్టడం సాధారణమైపోయింది. ఈ మారుతున్న జీవనశైలి కారణంగా చిన్నారుల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. అందులో ముఖ్యమైనది ఆటిజం.

సాంకేతిక పరికరాల వినియోగం పెరుగుతున్న కొద్దీ చిన్నారుల్లో ఆటిజం సమస్య కూడా పెరుగుతున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలు చురుకుగా లేకపోవడం, ఎవరితోనూ కలవకపోవడం, ఒంటరిగా ఉ ండడం, మాట ఆలస్యంగా రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయరాదని వైద్యులు సూచిస్తున్నారు.



**ఆటిజం అంటే ఏమిటి?**

ఆటిజం అనేది బాల్యంలోనే ప్రారంభమయ్యే నాడీ సంబంధిత అభివృద్ధి లోపం. దీనిని ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డీ) అని కూడా పిలుస్తారు. ఇది పిల్లల సామాజిక నైపుణ్యాలు, సంభాషణ సామర్థ్యం, ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది. జాతి, లింగం, ఆర్థిక స్థితి వంటి భేదాలు లేకుండా ఎవరినైనా ప్రభావితం చేసే సమస్యగా ఇది గుర్తించబడింది.

**ఆటిజం ప్రధాన లక్షణాలు**

కళ్లలోకి చూసి స్పందించకపోవడం
పేరు పిలిచినా స్పందించకపోవడం
మాట ఆలస్యంగా రావడం లేదా మాట్లాడకపోవడం
ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం
ఇతర పిల్లలతో కలవకపోవడం
ఒకే పనిని పదే పదే చేయడం
నవ్వినా స్పందించకపోవడం

సాధారణంగా మూడు నెలల వయస్సు నుంచే శిశువు తల్లిని గుర్తుపడుతుంది. కానీ ఆటిజం ఉన్న పిల్లల్లో ఈ స్పందన కనిపించకపోవడం ఒక ముఖ్య లక్షణంగా వైద్యులు చెబుతున్నారు.

**దేశంలో పరిస్థితి**

మన దేశంలో దాదాపు 2 శాతం పిల్లలు ఆటిజం సమస్యతో బాధపడుతున్నట్లు అంచనా. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఆటిజం ఉన్న పిల్లల్లో నిద్రలేమి, ఆందోళన, మూర్ఛ, హైపర్ యాక్టివిటీ వంటి సమస్యలు కూడా కనిపించే అవకాశముంది.

**ప్రపంచ ఆటిజం అవగాహన దినం**

ఆటిజంపై అవగాహన పెంచేందుకు ఐక్యరాజ్యసమితి ఏప్రిల్ 2వ తేదీని ప్రపంచ ఆటిజం అవగాహన దినంగా ప్రకటించింది. ఆటిజం ఉన్న పిల్లలకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించడం, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం.

**ఆటిజం ప్రమాదాన్ని ఎలా తగ్గించాలి?**

వైద్య నిపుణుల సూచనలు:
గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి
పోషకాహారం తీసుకోవాలి
వాయు కాలుష్యం నుండి దూరంగా ఉండాలి
ధూమపానం, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉ ండాలి
ఒత్తిడి తగ్గించే వ్యాయామాలు చేయాలి
అవసరమైన టీకాలు తీసుకోవాలి
శిశువు ఎదుగుదలను పర్యవేక్షించాలి
తల్లిదండ్రులకు సూచనలు
పిల్లలకు సెల్‌ఫోన్, ట్యాబ్‌ల వాడకం తగ్గించాలి
పిల్లలతో మాట్లాడాలి
కథలు చెప్పాలి
ఆటలు ఆడించాలి

ఇతర పిల్లలతో కలిసేలా ప్రోత్సహించాలిఆటిజాన్ని పూర్తిగా నయం చేసే చికిత్స లేకపోయినా, ముందుగా గుర్తిస్తే పిల్లల అభివృద్ధిని మెరుగుపరచవచ్చని వైద్యులు చెబుతున్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటే చిన్నారుల భవిష్యత్తు మెరుగుపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

-డాక్టర్ మనోజ్ రెడ్డి
మెడికల్ ఆఫీసర్
ముషీరాబాద్ అర్బన్ పి.హెచ్.సి దవఖాన

# కుల వివక్ష నిర్మూలకు కలిసి కట్టుగా కృషి చేయాలి.

- ఎస్ సి,ఎస్ టి చైర్మెన్ బట్టి వెంకటయ్య



**కామారెడ్డి ఏప్రిల్ 1( సమయం న్యూస్).** ..కుల వివక్ష నిర్మూలనకు దిశగా నర్సంపల్లి గ్రామంలో బుధవారం సమగ్ర సామాజిక సమానత్వ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గ్రామంలోని దళితులకు అన్ని దేవాలయాలలో ప్రవేశం కల్పించడం, సహపంక్తి భోజనాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు ఈ సందర్భంలో చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ రవి, డీటీడివో సౌజన్య, తహసిల్దార్ హిమబిందు, ఇతర సంబంధిత అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు విస్తృతంగా పాల్గొన్నారు. ..కార్యక్రమం ప్రారంభంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం సమానత్వాన్ని ప్రతిపాదించిందని, సమాజంలో కులాల ఆధారంగా ఉన్న వివక్షలు, విభేదాలు పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉ ందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమాన హక్కులతో జీవించే సమాజం నిర్మాణం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్న కుల వివక్షను నిర్మూలించడానికి ప్రభుత్వం, అధికారులు ,ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేవాలయాలు, సామాజిక కార్యక్రమాలు, పండుగలు వంటి అన్ని వేదికలలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.కుల వివక్ష లేదా దళితులపై ఏ విధమైన అన్యాయం జరిగినా, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని



సూచించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సమానత్వం, సామాజిక న్యాయం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. గ్రామాల్లో సామాజిక ఐక్యత పెంపొందించుకోవాలనిఅన్నారు. తదుపరి అదనపు కలెక్టర్, అధికారులు, ప్రజలు కలిసి గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం, శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలోకి అన్ని వర్గాల ప్రజలు కలిసి ప్రవేశించడం ద్వారా సామాజిక సమానత్వానికి ప్రాతినిధ్యం వహించారు.అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనాలు నిర్వహించడం ద్వారా కుల వివక్షకు వ్యతిరేకంగా బలమైన సందేశం పంపించారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఐక్యత, సామరస్య వాతావరణాన్ని నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించింది.కార్యక్రమం విజయవంతం కావడంలో గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, అధికారులు సమన్వయంతో కృషి చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను వేగవంతం చేయాలి



- జిల్లా కలెక్టర్ రాజర్షి షా


**బజార్హత్నూర్ ఏప్రిల్1( సమయం న్యూస్)** బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ఈ నెల 6వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన పిప్రి గ్రామంలో పర్యటించి, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, బహిరంగ సభా స్థలిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం స్థానిక రైతు వేదికలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఆరు నెలల్లో జిల్లాలో జరిగిన కార్యక్రమాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, సీఎం సభకు సుమారు 30 వేల నుండి 50 వేల మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకు డబుల్ బ్యారికేటింగ్ ఏర్పాటు చేయాలని, ప్రజల రాకపోకలకు సౌకర్యవంతమైన మార్గాలు కల్పించాలని ఆదేశించారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం సభా ప్రాంగణం లోపలే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇబ్బంది కలగకుండా షామియానాలు, నీడ ఏర్పాట్లు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ ఐసీయూ అంబులెన్సులతో పాటు అత్యవసర మందులతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను ముందుగానే గుర్తించి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే అధికారులందరికీ ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐ టి డి ఏ పి ఓ యువరాజ్ మర్మాట్, ఆర్ డి ఓ స్రవంతి, డి ఎస్పీ జీవన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




## ఐపీఎల్ పాస్‌లు, టికెట్ల బ్లాక్ మార్కెటింగ్‌పై
# ఈడీకి టీసీఏ ఫిర్యాదు

**హెచ్‌సీఏ ఖాతాలు, లావాదేవీలను పరిశీలించాలని వినతి**

**హైదరాబాద్:** ఐపీఎల్ పాస్ లు, టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఈడీ కి ఫిర్యాదు చేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పెద్దలు.. ఐపీఎల్ టికెట్లు, పాస్ లు బ్లాక్ మార్కెట్ వైపు మళ్లించారని.. కోట్ల రూపాయలు కొల్లగొట్టేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. గత 10 ఏళ్లలో దాదాపు 600 కోట్ల వరకు అవినీతి జరిగిందని.. హెచ్‌సీఏ ఖాతాలు, లావాదేవీలను పరిశీలించాలని కోరింది. ప్రభుత్వ సంస్థల క్రికెట్ క్లబ్ లను ఒక్కొకటి 2 నుంచి 2.5 కోట్లకు ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొంది. నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ, తప్పుడు ఖాతాల నమోదు, నకిలీ పత్రాలతో పెద్ద ఎత్తున స్కాం లు జరిగాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఫిర్యాదు లో పేర్కొన్నది. జీహెచ్‌ఎంసీ/ఎంసీహెచ్‌కి చెందిన 17 క్రికెట్ క్లబ్‌లను అక్రమంగా ప్రైవేటీకరించి, ప్రతి క్లబ్‌ను.. ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేశారని ఆరోపించింది. 103 ఒరిజినల్ క్లబ్ లను మాయం చేసి.. 80 కి పైగా నకిలీ క్లబ్ లను హెచ్‌సీఏలో చేర్చారని ఫిర్యాదులో పేర్కొంది.


Page 3 of 6

diversion of institutional funds, causing wrongful loss to HCA and unlawful gain to private individuals and persons in control of HCA. The said amount is public accountable money and must be recovered by attaching properties and freezing bank accounts of those responsible.

**(C) Illegal Privatization / Sale of Government GHMC/MCH Clubs:**
It is reliably represented that 17 GHMC/MCH cricket clubs, which are public Government/municipal assets meant for public sports development, were illegally privatized/handed over/sold to private individuals by HCA office bearers in collusion with private persons. Such acts amount to illegal alienation of Government property and unlawful occupation of public assets.

**(D) Membership Fraud and Vote Manipulation:**
HCA has allegedly:
- caused disappearance of 103 genuine member clubs,
- Illegally added 80+ fraudulent clubs.
- Manipulated voter lists and election process

# ప్రియ ముందంజ

**ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్**

**ఉలన్‌బాతర్(మంగోలియా):** ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల మెరుగైన ప్రదర్శన కొనసాగుతున్నది. పోటీల రెండో రోజైన మంగళవారం జరిగిన మహిళల 60కిలోల బౌట్‌లో ప్రియ 5–0 తేడాతో రిమ్మా వోలెసెంకో(కజకిస్థాన్)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ప్రియ... పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడుతూనే మరోవైపు ప్రత్యర్థికి దీటుగా బదులిస్తూ ముందుకు సాగింది. మరోవైపు పురుషుల 55కిలోల బౌట్‌లో జాదుమణిసింగ్ 2–3 తేడాతో రిమా యమగుచి(జపాన్)పై పోరాడి ఓటమిపాలయ్యాడు. ఈ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ బాక్సర్‌గా కొనసాగుతున్న యమగుచికి జాదుమణి దీటైన పోటీనిచ్చాడు.

# ఢిల్లీ క్యాపిటల్స్ 'సూపర్' విక్టరీ!

**ఆరు వికెట్ల తేడాతో లక్నోపై ఘన విజయం..**

**బౌలింగ్‌లో నటరాజన్, ఎంగిడి..**
**బ్యాటింగ్‌లో సమీర్ రిజ్వీ, అదుర్స్**





**ఢిల్లీ :** ఉత్కంఠభరిత మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలర్ల విజృంభణకు తోడు బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో లక్నో పెట్టిన మోస్తరు లక్ష్యాన్ని ఢిల్లీ సునాయాసంగా ఛేదించింది. పదిహేడు బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని తమ ఖాతాలో వేసుకుని సత్తా చాటింది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ సారథి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు.. ఢిల్లీ బౌలర్ల ధాటికి పెవిలియన్ కు క్యూ కట్టారు. అబ్దుల్ సమద్, (25 బంతుల్లో 36 పరుగులు).. మిచెల్ మార్ష్, (28 బంతుల్లో 35 పరుగులు) కాస్త పోరాడినప్పటికీ మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో లక్నో జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. షాబాజ్ అహ్మద్, 16 బంతుల్లో 15 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇరవై ఓవర్లు కూడా పూర్తి చేయకుండానే.. 18.4 ఓవర్లలో 141 పరుగులకే లక్నో జట్టు ఆలౌట్ అయ్యింది.

**ఢిల్లీ బౌలర్ల మాయాజాలం..**


లక్నో పతనాన్ని శాసించడంలో ఢిల్లీ బౌలర్లు కీలక పాత్ర పోషించారు. పేసర్ లుంగి ఎంగిడి, కేవలం 3.4 ఓవర్లు వేసి 27 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. మన తెలుగోడు నటరాజన్, కూడా నాలుగు ఓవర్లలో 29 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు తీసి లక్నో నడ్డివిరిచాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని మరింత కష్టాల్లోకి నెట్టాడు.

**సమీర్ రిజ్వీ, ఒంటిచేత్తో..**

142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆదిలోనే తడబాటు ఎదురైనా.. ఆ తర్వాత నిలకడగా ఆడి విజయం సాధించింది. ముఖ్యంగా యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ, అద్భుతమైన బ్యాటింగ్ తో ఆకట్టుకున్నాడు. 47 బంతులు ఎదుర్కొన్న రిజ్వీ.. 70 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. అతనికి తోడుగా ట్రిస్టన్ స్టబ్స్, 32 బంతుల్లో 39 పరుగులతో అజేయంగా క్రీజులో నిలిచి మ్యాచ్ ను ముగించాడు. నితీష్ రాణా, 15 పరుగులు చేశాడు. ఢిల్లీ జట్టు 17.1 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 145 పరుగులు చేసి గెలుపు సంబరాలు చేసుకుంది.

**పోరాడిన ప్రిన్స్ యాదవ్,**

లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్, మూడు ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. మొహ్సిన్ ఖాన్, మొహమ్మద్ షమీ, చెరో వికెట్ తీసుకున్నారు. తక్కువ స్కోరును రక్షించుకునే క్రమంలో లక్నో బౌలర్లు శాయశక్తులా ప్రయత్నించినా.. ఢిల్లీ బ్యాటర్ల ముందు వారి పప్పులు ఉడకలేదు. తుది ఫలితంగా లక్నోకు పరాజయం తప్పలేదు.





# స్లో ఓవర్ రేట్..

**కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు 12 లక్షల ఫైన్**

**ఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఎట్టకేలకు బోణి కొట్టింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో 3 వికెట్ల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. అయితే ఈ గెలుపు సంబరాల్లో ఉన్న పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బీసీసీఐ గట్టి షాక్ ఇచ్చింది. మ్యాచ్ గెలిచిన ఆనందంలో ఉన్న అయ్యర్‌పై భారీ జరిమానా విధిస్తూ ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది.

**తప్పని 'స్లో ఓవర్ రేట్' దెబ్బ**

గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నిర్ణీత సమయంలోగా ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. స్లో ఓవర్ రేట్ నిబంధనను ఉల్లంఘించినందుకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ఈ నిబంధన కింద జరిమానా ఎదుర్కొన్న తొలి కెప్టెన్‌గా అయ్యర్ నిలిచాడు. ఇది మొదటి తప్పు కావడంతో కేవలం ఫైన్‌తో సరిపెట్టారని, ఇదే పునరావృతమైతే కెప్టెన్‌పై నిషేధం పడే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు.

**కూపర్ కానలీ మెరుపులు**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 162 పరుగులు చేసింది. అనంతరం 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌తో ఐపీఎల్ అరంగేట్రం చేసిన యువ ఆటగాడు కూపర్ కానలీ అద్భుత ఇన్నింగ్స్ ఆడి పంజాబ్‌ను గెలిపించాడు. కేవలం 44 బంతుల్లోనే 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జట్టు గెలిచినప్పటికీ, బ్యాటింగ్‌లో కేవలం 18 పరుగులకే వెనుదిరగడం, చేతికి గాయం కావడం, దానికి తోడు భారీ జరిమానా పడటంతో అయ్యర్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# 3 కోట్ల ఫుట్‌ఫాల్స్ దాటేసిన ధురంధర్–2



రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది. వసూళ్లలోనే కాకుండా, థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య (ఫుట్‌ఫాల్స్) విషయంలో కూడా ఈ సినిమా బాలీవుడ్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో 3 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను దాటేసింది. కరోనా తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో హిందీ చిత్రంగా 'ధురంధర్ 2' నిలిచింది. గతంలో 'గదర్ 2', 'జవాన్', స్త్రీ 2, ఛావా, 'ధురంధర్' మొదటి భాగం మాత్రమే ఈ మార్కును చేరుకున్నాయి. ప్రస్తుతం హిందీ వెర్షన్లలో అత్యధిక ఫుట్‌ఫాల్స్ సాధించిన చిత్రంగా 'పుష్ప 2' (దాదాపు 4 కోట్లు) కొనసాగుతోంది. అయితే, 'ధురంధర్: ది రివెంజ్' హవా చూస్తుంటే.. ఫుల్ రన్ ముగిసే సమయానికి అన్ని భాషల్లో కలిపి 5 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ రెండు భాగాలు కలిపి మొత్తం 8 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడవడం అనేది భారతీయ సినిమా చరిత్రలో ఒక అసాధారణమైన విజయంగా రికార్డు సృష్టించనుంది. కలెక్షన్ల పరంగా 'ధురంధర్ 2' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన 13వ రోజు కూడా ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను సాధించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా రూ.1400 కోట్ల మార్కును దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. భారతదేశంలో ఈ సినిమా ఇప్పటివరకు రూ.899 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, బుధవారం మార్నింగ్ షోలతో రూ.900 కోట్ల మైలురాయిని చేరుకుంది. రెండో వీకెండ్‌లో రూ.170 కోట్లు వసూలుచేయడంతో భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక రెండో వారాంతపు వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.




# 10న వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో టాలీవుడ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, అనేక వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా తెలుగులో టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ విషయానికి వస్తే.. ఇది 2040వ సంవత్సరం నేపథ్యంలో సాగే ఒక ఆసక్తికరమైన ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ డ్రామాగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్ షిప్స్‌ను ఇష్టపడని హీరో(ప్రదీప్ రంగనాథన్) హీరోయిన్ (కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటారు. అయితే వీరి ప్రేమకథకు ఎస్. జే సూర్య ఎలా అడ్డుపడతాడు. ఎస్. జే సూర్య నడుపుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సంస్థ ఉద్దేశ్యం ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో ప్రేమ గురించే కాకుండా 2040లో ఏం మార్పులు రాబోతున్నాయి అనే చిన్న చిన్న విషయాలను కూడా చాలా చక్కగా చూపించారు మేకర్స్. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నఈ చిత్రాన్ని లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మించారు.

# బిజీ షెడ్యూల్ వల్లనే డ్రాగన్‌లో నటించలేకపోయా

**మళయాళ నటుడు టొవినో థామస్ వెల్లడి**

టాలీవుడ్ హీరో ఎన్టీఆర్– కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. ' తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా' అని వివరించారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.






# సెట్స్‌లో నటి పట్ల అసభ్య ప్రవర్తన

**మళయాళ దర్శకుడు రంజిత్ అరెస్ట్**

ప్రముఖ మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌ను లైంగిక వేధింపుల ఆరోపణలపై కొచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక యువ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్నాకుళం సెంట్రల్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఒక సినిమా సెట్‌లో రంజిత్ తనతో అనుచితంగా ప్రవర్తించారని ఇటీవల ఓ నటి ఫిర్యాదు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రాథమిక విచారణ కోసం కొచ్చికి తరలించారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడానికి ముందు, చిత్ర యూనిట్‌లోని అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేశారు. కమిటీ సభ్యులు దానిని పరిశీలించి, అది తీవ్రమైన అంశంగా గుర్తించడంతో తదుపరి చర్యల కోసం కేసును కేరళ పోలీసులకు బదిలీ చేశారు. హేమ కమిటీ నివేదిక వెలువడిన తర్వాత మలయాళ సినీరంగంలో బయటపడుతున్న వరుస వేధింపుల కేసుల్లో ఇది మరొకటి కావడం గమనార్హం. గతంలోనూ రంజిత్‌పై ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. 2024లో బెంగాలీ నటి చేసిన వేధింపుల ఆరోపణల వల్ల ఆయన తన కేరళ చలనచిత్ర అకాడమీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అప్పట్లో ఆ ఆరోపణలను రంజిత్ తోసిపుచ్చినప్పటికీ, తాజాగా మరో నటి ఫిర్యాదు చేయడంతో ఆయన చుట్టూ ఉచ్చు బిగిసినట్లయింది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**



# దోచుకోవడానికే అమరావతి ప్లాన్

## అబద్ధాలు, అడ్డగోలు సంపాదన బాబు నైజం

## రాష్ట్రానికి రాజధాని అన్నది ఎక్కడా లేదు

## కేంద్రానికి మాత్రమే రాజధాని అవసరం

## మావిగన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్

**అమరావతి, ఏప్రిల్ 1:** చంద్రబాబు లాంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమరావతి పేరుతో దోపిడీకి రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు. అబద్ధాలు, అడ్డగోలు సంపాదన చంద్రబాబుకు తెలిసిన విద్య అని అన్నారు. చంద్రబాబుకు నిజాయితీ, చిత్తశుద్ధి లేవని, ఆయన దృష్టిలో పరిపాలన అంటే కేవలం అవినీతి, దోపిడీ మాత్రమేనని జగన్ దుయ్యబట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జగన్ నిప్పులు చెరిగారు. గత వారం శాసనసభలో అమరావతిపై ప్రవేశపెట్టిన తీర్మానం కేవలం ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నమని జగన్ విమర్శించారు. అసలు రాజ్యాంగంలో రాష్ట్రానికి 'రాజధాని' అనే పదమే లేదని, కేవలం దేశానికి మాత్రమే రాజధాని ఉంటుందని స్వయంగా మంత్రి పార్థసారధి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని అనేది రాష్ట్రాల ఇష్టమని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ రాజధానులను తామే నిర్ణయించుకున్నాయని తెలిపారు. అలాంటప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఈ తీర్మానాల పేరుతో ఎందుకు డ్రామాలు ఆడుతోందని జగన్ ప్రశ్నించారు. అమరావతి నిర్మాణ వ్యయంపై జగన్ పలు ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించారు. గతంలో 50 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలకు లక్ష కోట్లు అవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అదనంగా మరో 50 వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. చదరపు అడుగుకు రూ. 11 వేల నుండి రూ. 14 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఏ స్కాములు లేకపోతే అంత ఖర్చు ఎందుకు అవుతుంది? అభివృద్ధికి అవసరమైన రెండు లక్షల కోట్లు ఎక్కడి నుండి వస్తాయి? ఈ ప్రాజెక్ట్ ఎన్నేళ్లకు పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. ఐదున్నర గంటల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇలాంటి కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, కేవలం తనను , వైసీపీని దూషించడానికే సభను వాడుకున్నారని జగన్ మండిపడ్డారు. ఒకవైపు అసెంబ్లీని పిలిచిన ప్రభుత్వం, అదే చట్టసభలో భాగమైన కౌన్సిల్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కౌన్సిల్‌లో చంద్రబాబు అవినీతిని సభ్యులు కడిగిపారేస్తారనే భయంతోనే బాబు ఈ నిర్ణయం తీసుకున్నారని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో ఎవరూ రాజధానిని మార్చకుండా చట్టం తెస్తామన్న చంద్రబాబు వ్యాఖ్యలపై జగన్ స్పందిస్తూ.. అసెంబ్లీలో చట్టసవరణలు చేసే అధికారం సభకు ఉంటుందన్న విషయం బాబుకు తెలియదా అని ప్రశ్నించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల్లో సానుభూతి పొందడానికే చంద్రబాబు ఇటువంటి విన్యాసాలు చేస్తున్నారని, ఆయన అసలు రంగు ప్రజలందరికీ తెలుసని జగన్ స్పష్టం చేశారు. అమరావతి విషయంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబడుతూ జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం రాజధాని అమరావతిపై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. పార్లమెంట్‌లో రాజధాని అమరావతిపై కీలక చర్చ జరిగే సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మావిగన్ ప్లాన్-బి అంటూ ఏపీ రాజధానిపై మరోసారి జగన్ గందరగోళ ప్రకటన చేశారు. ఏపీ కోసం ప్రాక్టికల్‌గా ఆలోచించే వారికి మాత్రమే తాను చెప్పేది అర్థమవుతుందని అన్నారు. ప్లాన్-బి ప్రకారం విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు ప్రాంతాలను కలిపి రాజధాని చేయాలని జగన్ అన్నారు. దీనికి మావిగన్ అని పేరు పెట్టాలన్నారు. అమరావతికి పెట్టే రూ.2 లక్షల కోట్లలో 10 శాతం పెడితే మావిగన్ భవిష్యత్తులో మంచి నగరం అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు వైసీపీ అధినేత. రాష్ట్ర రాజధాని అనేది పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని చెప్పుకొచ్చారు.

# ఇక అమరావతే ఆంధ్రాకు శాశ్వత రాజధాని

## గత వైకాపా అరచాకంతో రాజధాని లేకుండా పాలన

## ఆనాటి రైతులకు తీవ్ర వేధింపులు..మహిళలపై దాడులు

## లోక్‌సభ చర్చలో ఎంపి పురంధేశ్వరి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని భాజపా ఎంపీ పురందేశ్వరి అన్నారు. లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్వహించిన చర్చలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన ప్రక్రియ అరాచకంగా జరిగిందన్నారు. ఆనాడు చర్చ లేకుండానే రాష్ట్ర విభజన చేశారు. పార్లమెంట్‌లో లైట్లు, కెమెరాలు ఆపి బిల్లు పాస్ చేశారు. చట్టాన్ని గౌరవించి విభజనను ప్రజలు అంగీకరించారు. ఆ తర్వాత ఏపీకి రాజధాని అవసరం వచ్చింది. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధప్రదేశ్ పాలన ప్రారంభమైంది. విభజన ఆగ్రహం నుంచి రాజధాని అమరావతి పుట్టింది. రాజధానికి 29వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములిచ్చారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక అమరావతి భవితవ్యం అంధకారంలో పడింది. త్యాగం చేసిన రైతుల పట్ల గత ప్రభుత్వం అమానుషంగా ప్రవర్తించిందని పురందేశ్వరి అన్నారు. వైసీపీ హయాంలో రాజధానిపై తీవ్ర అస్థిరత నెలకొందని.. రాజధానిపై గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని విమర్శించారు. అమరావతి తొలి ప్రజా రాజధానిగా గుర్తింపు తెచ్చుకుందని ఎంపీ తెలిపారు. విభజన ఆగ్రహం నుంచి రాజధాని అమరావతి పుట్టిందని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారన్నారు ఎంపీ. వైసీపీ వచ్చాక అమరావతి భవితవ్యం అంధకారంలో పడిందని వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో ఏపీలో అరాచక పాలన సాగిందని విమర్శలు గుప్పించారు. ఆడవారని కూడా చూడకుండా నానా హింసలు పెట్టారని అన్నారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం సహకరించలేదన్న కాంగ్రెస్ విమర్శలు సరికాదన్నారు. రాజధాని కోసం కేంద్ర ప్రభుత్వం హడ్కో నిధులు విడుదల చేసిందని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు.

# ఒంటిమిట్టలో అయోధ్య వైభవం

- సీతారాముల కల్యాణ వేదికకు అద్భుత పుష్పాలంకరణ!
- త్రేతాయుగంనాటి దృశ్యాలను తలపించిన యాక్రిలిక్ పెయింటింగ్
- 9 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 80 వేల కట్ ఫ్లవర్స్‌తో అలంకరణ



**ఒంటిమిట్ట:** కడప జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం కోసం టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో కల్యాణ వేదికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా, త్రేతాయుగంనాటి అయోధ్యను గుర్తుకు తెచ్చేలా రూపొందించిన ఈ వేదిక భక్తులను మంత్రముగ్ధులను చేస్తోంది. రంగురంగుల పుష్పాలతో అలరారుతున్న వేదికపై, ప్రాచీన ఆలయాలలోని దశావతారాల సెట్టింగు, రామాయణంలోని ముఖ్య ఘట్టాలతో కూడిన యాక్రిలిక్ పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలుగుదనం ప్రతిబింబించేలా చెరుకులు, టెంకాయ గెలలు, అరటి మరియు మామిడాకులతో పాటు, విదేశీ జాతుల పుష్పాలను కూడా అలంకరణకు ఉపయోగించారు. హెలికానియమ్స్, టార్చ్ జింజర్, నీలం ఆర్కిడ్, రెడ్ ఆంథూరియం వంటి పుష్పాలతో వేదిక కనువిందు చేస్తోంది. ఇందుకోసం 5 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 50 వేల కట్ ఫ్లవర్స్‌ను వినియోగించారు. అదేవిధంగా, ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో మరో 4 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్‌తో అత్యద్భుతమైన పుష్పాలంకరణలు చేపట్టారు. టీటీడీ ఉద్యానవన విభాగం సూపరింటెండెంట్ శ్రీ శ్రీనివాసులు పర్యవేక్షణలో రెండు రోజులపాటు 100 మంది అలంకరణ నిపుణులు, మరో 100 మంది టీటీడీ సిబ్బంది ఈ అలంకరణ పనుల్లో పాల్గొన్నారు. సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు పుష్పాల అలంకరణ చూసి పరవశించిపోతున్నారు.





# ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం.. పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు

ఒంటిమిట్ట: వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణోత్సవ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తితిదే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికే పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టింది. ప్రధాన కల్యాణ వేదికకు ఎదురుగా 120 గ్యాలరీలు ఏర్పాటు చేసింది. గ్యాలరీల్లో కూర్చునే భక్తులకు తీర్థప్రసాదాలు, ముత్యాల తలంబ్రాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్ల కిట్‌తో పాటు ఈసారి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించనుంది. 2,500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు.

# నేతన్నలకు 'ఉచిత విద్యుత్' కానుక

- చేనేత మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్లు ఫ్రీ
- ఏడాదికి రూ. 150 కోట్ల భారం భరించనున్న ప్రభుత్వం: మంత్రి గొట్టిపాటి



**అమరావతి:** కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మరో కీలక హామీని నెరవేరుస్తూ రాష్ట్రంలోని చేనేత కార్మికులకు గొప్ప ఊరటనిచ్చింది. బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. ఈ పథకం కింద సాధారణ చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు (పవర్ లూమ్స్) 500 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా అందిస్తామని, దీనివల్ల ప్రభుత్వంపై ఏటా రూ. 150 కోట్లకు పైగా అదనపు భారం పడుతుందని ఆయన వెల్లడించారు. యువగళం పాదయాత్రలో భాగంగా అనంతపురం జిల్లా ధర్మవరంలో చేనేత కార్మికుల కష్టాలను స్వయంగా చూసిన నారా లోకేశ్ ఇచ్చిన హామీని నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను అపార అనుభవంతో గాడిలో పెడుతున్నామని, 22 నెలలుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ట్రూఅప్ భారం లేకుండా పాలన సాగిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పునరుత్పాదక ఇంధన వనరులైన సోలార్, విండ్, గ్రీన్ హైడ్రోజన్ విధానాల ద్వారా విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గిస్తున్నామని మంత్రి తెలిపారు. లో-వోల్టేజీ సమస్యల పరిష్కారానికి కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టడంతో పాటు నియోజకవర్గానికి ఒక 'నమూనా సోలార్ గ్రామాన్ని' అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. సీపీడీసీఎల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 11 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణమే మంజూరు చేయాలని, వేసవి ముగిసే నాటికి ప్రతి నియోజకవర్గంలో 6 వేల పీఎం సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లు అందించాలని, వినియోగదారుల అనుమతితోనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను చేపట్టాలని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వెసులుబాటు కల్పించేలా మరిన్ని సంస్కరణలు తీసుకొస్తామని, వినియోగదారుల సంతృప్తి స్థాయిని 90 శాతానికి పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

# నరసరావుపేట ఎమ్మెల్యేపై టీడీపీ హైకమాండ్ సీరియస్

- లిఖితపూర్వక వివరణకు ఆదేశం!
- ఎస్పీ కార్యాలయంలో భీష్మించుక కూర్చున్న అరవిందబాబు తీరుపై పల్లా శ్రీనివాసరావు ఆగ్రహం
- రెండు రోజుల్లో అమరావతికి రావాలని చంద్రబాబు ఆదేశం



**అమరావతి:** పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వ్యవహరించిన తీరుపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీవ్రస్థాయిలో మండిపడింది. క్రమశిక్షణ విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేస్తూ, ఈ వ్యవహారంపై తక్షణమే లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యేను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యేకు స్వయంగా ఫోన్ చేసిన పల్లా, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు.

### అసలేం జరిగిందంటే:

మంగళవారం మధ్యాహ్నం నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు కార్యాలయానికి వెళ్లారు. జిల్లా పోలీస్ సెల్ న్యాయ సలహాదారుగా తాను సిఫార్సు చేసిన రామినేని ప్రసాద్ పేరును ఎందుకు ఆమోదించడంలేదని ఎస్పీని నిలదీశారు. 8 నెలల క్రితమే లేఖ ఇచ్చినా ఉత్తర్వులు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆర్డర్ కాపీ ఇచ్చే వరకు కదిలేది లేదని ఎస్పీ చాంబర్‌లోనే భీష్మించుక కూర్చున్నారు. దాదాపు 10 గంటల పాటు అక్కడే ఉండిపోవడమే కాకుండా, ఆ సమయంలో మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చిన ఫోన్లను కూడా ఆయన లెక్కపెట్టలేదని సమాచారం.

### చంద్రబాబు ఆరా:

ప్రభుత్వ అధికారులతో ఇలాంటి వాగ్వాదానికి దిగడంపై ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ దృష్టికి తీసుకురావాలి తప్ప, అధికారుల వద్ద ఇలా ప్రవర్తించడం సరికాదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు మూడు రోజుల్లో ఎమ్మెల్యే అరవిందబాబును అమరావతికి పిలిపించి వివరణ తీసుకోవాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. ఎమ్మెల్యే తీరుపై అటు పోలీస్ వర్గాల్లోనూ చర్చ నడుస్తోంది. గతంలోనూ ఆర్డీవో కార్యాలయంలో ఆయన ఇదే తరహాలో వ్యవహరించడంపై పార్టీ నాయకత్వం గుర్తు చేస్తోంది.

# బాన్సువాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం!

- రైతులకు మద్దతు ధర దక్కాలి: పోచారం శ్రీనివాస రెడ్డి..
- వర్నిలో అభివృద్ధి పనులకు భూమిపూజ..



**బాన్సువాడ, ఏప్రిల్ 1:**

బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస రెడ్డి, గురువారం ప్రారంభించారు. కొల్లూరు, తిమ్మాపూర్, ఎస్ ఎన్ పురం, పాత వర్ని గ్రామాల్లోని సొసైటీల పరిధిలో ఈ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. అనంతరం వర్ని మండల కేంద్రంలో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం, సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు.

### మద్దతు ధరతోనే కొనుగోలు

ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస రెడ్డి, మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కేంద్రాలకే ధాన్యం తరలించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు 2,389 రూపాయలు, బీ గ్రేడ్ ధాన్యానికి 2,369 రూపాయలు చెల్లిస్తామని వెల్లడించారు. దేశంలో రైతుల నుండి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా సహకరించాలని పోచారం శ్రీనివాస రెడ్డి, సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# విధి నిర్వహణ సరేసరి... హక్కుల మాటేమిటి మరి

### ఏప్రిల్ 2... పోలీసు పతాక దినోత్సవం సందర్భంగా

శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలకు, ఆస్తులకూ రక్షణ కల్పిస్తూ, నేరాలు, విధ్వంసాలూ జరక్కుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థ పోలీసు వ్యవస్థ. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేము, బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు పోలీసేనన్నది నగ్న సత్యం..

అత్యవసర సర్వీసుల చట్టం ప్రకారం క్రమశిక్షణతో పనిచేస్తూ, శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు వ్యవస్థలో కానిస్టేబుళ్ళు కనీసం ప్రాథమిక హక్కులకు కూడా నోచుకోవడం లేదు. బ్రిటిష్ పరిపాలన అంతమై డెబ్బది అయిదు వసంతాలు దాటుతున్నా, వారు రూపొందించిన పోలీసు వ్యవస్థలో, ఆశించిన స్థాయిలో, అధునిక సమకాలీన సమాజ పరిస్థితుల కనుగుణంగా, మౌలిక మార్పులు చోటు చేసుకోక పోవడం శోచనీయం. పెరుగుతున్న జనాభా దృష్ట్యా, ఇన్నేళ్ళుగా జరుగుతున్న రిక్రూట్మెంట్ తర్వాత కూడా, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కూడా తక్కువే. ఉన్న పోలీసు ఉద్యోగులు, వ్యయ ప్రయాసల కోర్చి అదనపు పని గంటలలో శక్తికి మించి శ్రమిస్తున్నప్పటికీ, వీరి శ్రమకు తగిన ఫలితం లభించకపోగా, పడిన కష్టానికి కనీస గుర్తింపునకు సైతం నోచుకోవడం లేదు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులవలె, పోలీసు సిబ్బందికి కనీస సెలవులు, పండగ సెలవులు కూడా వర్తింపక పోవడాన్ని బట్టి వారి ఇబ్బందులు ఎలా ఉంటాయో ఊహించు కోవచ్చు. ఈ శాఖ సిబ్బందికి కేవలం 15 క్యాజువల్ లీవులు, 15 ప్రత్యేక అనుమతి సెలవులు మాత్రమే ఉంటాయి. అయితే పై అధికారి దయాదాక్షిణ్యాలపై ఈ సెలవులను వాడుకునే అవకాశాలుంటాయి. పోలీసు శాఖ సామర్థ్యం, పనితీరు ఆ శాఖలోని క్రింది స్థాయి ఉద్యోగులైన కానిస్టేబుల్లు మరియు హెడ్ కానిస్టేబుల్స్ పైననే ఆధార పడి ఉంటుందనేది నగ్నసత్యం. విధి నిర్వహణలో, ప్రత్యక్షంగా ప్రజలకు అందుబాటులో ఉండేది వారు. ప్రజల నుండి ఎదురయ్యే ప్రతిఘటనలు, ఛీత్కారాలు, విమర్శలు, ప్రమాదాలూ అనుభవించాల్సిందే వీరే. ఎప్పుడు ఏ విధి నిర్వహణ చేయాలో, తెలియని స్థితిలో, ఎక్కడికి వెళ్ళాలో, కనీసం కట్టుకున్న ఇల్లాలు, కుటుంబ సభ్యులకు కూడా చెప్పకుండా వెళ్ళాల్సిన దుస్థితులు అనుక్షణం ఎదురవుతూనే ఉంటాయి. ఎనిమిది గంటల పని దినాలు ఈ శాఖ ఉద్యోగులకు ఏనాడు వర్తించవు. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి, రౌడీలు, గూండాలు, దొంగలు, సాయుధులైన అజ్ఞాతులతో ప్రాణాలకు తెగించి తలపడడం, రాత్రివేళల్లో ప్రజలంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో వీరు కర్తవ్య నిర్వహణలో భాగంగా మేల్కొని ఉండడం, గాలింపు చర్యల పేరిట



అంధకారంలో, కీకారణ్యంలో, చెట్టూ, పుట్టా పట్టుకు తిరగడం అనూహ్య ప్రమాదాలకు గురికావడం పోలీసులకు నిత్య కృత్యమే అవుతున్నది. తమ ప్రాంతానికి ప్రముఖులెవరైనా వస్తే, మారుమూల గ్రామాలకు వారు వెళితే, బందోబస్తులో భాగంగా, గంటల కొద్దీ, ఒకోసారి రోజుల ముందే ఆ ప్రాంతానికి వెళ్ళి, వి.ఐ.పి.లు వచ్చి వెళ్ళే వరకూ, రాత్రి, పగలూ తేడా లేకుండా పడిగాపులు గాస్తూ, శ్రమకోర్చి, ఎండా, వానా, చలికి వెరవక ధర్మ నిష్టతో , కార్యదీక్షతో పనిచేసినా, అప్పుడప్పుడూ ఉన్నతాధికారుల అగ్రహానికి గురి కాక తప్పని పరిస్థితులు ఎదురవడం బాధాకరం. ఇవన్నింటికి తోడు అధికారుల కనుసన్నలలో మెదులుతూ, వారికి అనుకూలంగా నడుచుకుంటూ స్వంత పనులు గాలికొదిలి, అధికారుల పనులను చేయక తప్పని దుస్థితులు వారికి చర్విత చర్వణాలే అవుతున్నాయి. ఇన్ని ఇబ్బందులను, సవాళ్ళను ఎదుర్కొని, చిత్తశుద్ధితో, కార్యదీక్షా దక్షతతో, అంకితభావంతో విధులను నిర్వర్తించినా, ప్రశంసలూ, అవార్డులు, పురస్కారాలూ, బహుమానాలూ, ఎక్కువగా అధికారులకే దక్కుతాయనేది నిర్వివాదాంశం. పోలీసు కానిస్టేబులుకు కచ్చితమైన పని గంటలుండాలని, ఎనిమిది గంటలకు మించి పని చేయిస్తే, ఆ శ్రమకు ప్రతిఫలం అందించాలని గతంలో "ధర్మవీర కమిషన్" సూచించారు. అది ఏనాడు అమలుకు నోచుకోక పోవడం విచారకరం. పోలీసు వ్యవస్థలోమార్పు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కమిషన్లను వేసినా, వాటి సూచనల అమలులో, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం శోచనీయం. "సమాజ రక్షణే ప్రథమ కర్తవ్యంగా, చట్ట పరిరక్షణే ధ్యేయంగా", ప్రజా రక్షణకై నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు "స్వీయ రక్షణే" నేటి పరిస్థితుల్లో కరువు కాగా, త్యాగశీలులైన రక్షక భటులు తీవ్రవాదులకు టార్గెట్లుగా మారుతూ, అనుక్షణం ప్రమాదం అంచున పయనిస్తూ, విధి నిర్వహణలో మమేక మవుతున్నారు.

### "పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కృషి"

తెలంగాణ గత ప్రభుత్వం పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేసింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శాంతి భద్రతల నిర్వహణ కోసం 350 కోట్ల రూపాయల నిధులను కేటాయించారు. అలాగే పోలీసు స్టేషన్లకు పెద్దమొత్తంలో కొత్త వాహనాలను సమకూర్చిన ఘనత కూడా టిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కింది. రాష్ట్రంలో ప్రతి పోలీసు స్టేషన్ కు అధునాతన సౌకర్యాలతో కూడిన వాహనాలు ఉండాలనే ఉద్దేశ్యంతోనే మొత్తం 600 టాటా సుమోలు, 1600 ఇన్నోవాకార్లు, 1500 మోటారు సైకిల్ కొనుగోలు తో పాటు, ప్రతి నెల పోలీస్ స్టేషన్ నిర్వహణకు, కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషను 75 వేలు, జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషను 50 వేలు, పట్టణ మండల పోలీసు స్టేషన్లకు 25 వేల చొప్పున నిధులను సమకూర్చి పోలీసు వ్యవస్థను పటిష్టం పరిచారు. ఇటీవల 'హోంగార్డు'లకు జీతభత్యాలను కూడా పెంచింది. పోలీసులకు, వారాంతరపు సెలవులను ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ఆచరణపై దృష్టి సారించ లేక పోయింది...అలాగే క్రింది స్థాయి పదోన్నతుల ప్రక్రియ కొనసాగించ లేక పోయింది. ప్రధానంగా "మీ వెంటే మేమున్నాం" అంటూ వారికి అన్ని విధాలా అభయహస్తం అందిస్తూ, "మీ సంక్షేమమే మాకు ముఖ్యం" అనే భరోసా కలిగిస్తూ, పోలీసుల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొనేలా కొత్త కాంగ్రెస్

రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం అనివార్యంగా ఉంది

**రామ కిష్టయ్య సంగనభట్ల,**
**9440595494**

# పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి

### ఏప్రిల్ 2...అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

**డెన్మార్క్ దేశానికి చెందిన ప్రఖ్యాత బాల సాహిత్య రచయిత హాన్స్ క్రిస్టియన్ ఆండర్సన్ 2 ఏప్రిల్ 1805 న జన్మించాడు. ఆయన పుట్టినరోజైన ఏప్రిల్ 2 ను అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవంగా ఇంటర్నేషనల్ బోర్డ్ ఆన్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తోంది.1967 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2 వ తేదీన అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటున్నారు.**




పిల్లల్లో పఠనాసక్తిని కలిగించడం, పెంపొందించడం, పిల్లలతో బాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యం వైపు ఆకర్షించడం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం.

అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయుప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది.

గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటి ల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావా లనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడా నికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపం చంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం.

ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయాలను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

**-రామ కిష్టయ్య సంగన భట.**
**9440595494**

# మోత్కుపల్లి గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయి అవార్డు!

- 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో వికారాబాద్ జిల్లాకు గర్వకారణం..
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కలెక్టర్ దీపక్ తివారీ, హర్షం..

**వికారాబాద్, ఏప్రిల్ 1:**

జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు ఇచ్చే ప్రతిష్టాత్మక 'దీన్ దయళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల'కు మన రాష్ట్రంలోని రెండు గ్రామాలు ఎంపికయ్యాయి. వికారాబాద్ జిల్లా కోటపల్లి మండలంలోని మోత్కుపల్లి, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండలంలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీలు ఈ గౌరవాన్ని దక్కించుకున్నాయి. ముఖ్యంగా మోత్కుపల్లి గ్రామ పంచాయతీకి 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో ఈ జాతీయ అవార్డు లభించింది.

గ్రామస్థులందరికీ ఆన్లైన్ పౌర సేవలు అందించడం.. భారత్ నెట్, సీఎస్సీ సేవలు అందుబాటులో ఉంచడంతో పాటు పంచాయతీ ఆదాయ వ్యయాలు, అభివృద్ధి ప్రణాళికలను నూటికి నూరు శాతం 'ఈ-గ్రామ్ స్వరాజ్' వెబ్సైట్లో పొందుపరిచారు. అదేవిధంగా పీఎంజేడీవై, పీఎం ముద్రా, పీఎం కిసాన్, ఉమాంగ్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, పీఎంజీ దిశ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను డిజిటల్ ప్లాట్ఫారమ్ ద్వారా ప్రజలకు చేరవేయడం.. గ్రామ సభలు, పంచాయతీ సమావేశాలను జవాబుదారీతనంతో నిర్వహించడం.. రికార్డులను పక్కాగా భద్రపరచినందుకు ఈ అత్యున్నత అవార్డు దక్కింది.



మోత్కుపల్లి గ్రామానికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించిన మోత్కుపల్లి గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలతో పాటు ఎంపీఓ, ఎంపీడీఓ, డీఎల్పీఓ, జిల్లా పంచాయతీ అధికారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ అవార్డు జిల్లాలోని ఇతర పంచాయతీలకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. పారదర్శక పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ధాన్యం సేకరణ పక్కాగా చేపట్టాలి

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగాం, ఏప్రిల్ 1:** రబీ సీజన్లో రైతులు పండించిన ధాన్యాన్ని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సజావుగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, తో కలిసి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరగాలని అధికారులను కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులను ఆదేశించారు. తూకం యంత్రాలు, తడి కొలిచే పరికరాలు, గోదాముల సౌకర్యం, టార్పాలిన్లు, గన్నీ సంచులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా రైతులకు తాగునీరు.. విశ్రాంతి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. రైతుల నుండి ధాన్యం సేకరించిన వెంటనే వారికి రసీదులు అందజేయాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో డీఎంసీఎస్ హాథీరామ్, ఆర్డీఓ శ్రీనివాస్ గౌడ్, డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ వసంత, డీసీఎస్ఓ పావని, డీసీఓ కోదండరాములు, డీఎంఓ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.